Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 08.08.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 10 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# తీరు మారేనా? కేడర్ నిలిచేనా?

## వలసలతో జగన్‌కు అగ్ని పరీక్ష

### వైకాపాను నేలమట్టం చేయాలని చంద్రబాబు ప్లాన్

మొన్న ఎన్నికలకు ముందు వైయస్సార్ కాంగ్రెస్ అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి కొన్ని పొరపాట్లు చేయకపోయివుంటే ఈరోజు ముఖ్యమంత్రి సీట్లో ఆయనుండేవాడు. ప్రతిపక్ష నాయకుడి పాత్రలో చంద్రబాబు ఉండేవాడు.

స్వయంకృతాపరాధం వల్లే జగన్‌కు నోటి దాకా వచ్చిన అధికారం జారిపోయింది. వైకాపా అధికారంలోకి రాలేకపోయిన ప్రభావం ఈరోజు జగన్ కోసం పనిచేసిన వారందరి మీదా పడుతోంది. మొన్న ఎన్నికల్లో అయితే జగన్ గాలి ఉండింది. వైయస్ సానుభూతి పనిచేసింది. అయితే గెలుపుకు ఆ రెండే చాలవు. పార్టీ నాయకుడు వ్యూహాత్మకంగా వ్యవహరించలేకపోయారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎత్తిపోయింది. ఆ కేడర్ అంతా తెలుగుదేశం వైపుకు తరలిపోతుందని తెలిసినా జగన్ తన వైపుకు వారిని రప్పించుకోలేకపోయారు. వాళ్లంతా ముందుగా చూసింది జగన్ వైపే. ఆరోజు జగన్ ఆఫీసు ముందు హౌస్‌ఫుల్ బోర్డు పెట్టడంతో ఇక గత్యంతరం లేక తెలుగుదేశంలోకి వెళ్ళిపోయారు. ఇలా కాంగ్రెస్‌ను వదిలి వెళ్ళిన కేడర్ తెలుగుదేశం అధికారంలోకి రావడానికి కారణాలలో ఒకటని అనుకోవచ్చు.

వైకాపా అధికారంలోకి రాలేకపోవడానికి పలు కారణాలున్నాయి. ఇప్పుడు వాటిని సమీక్షించుకుని లాభం లేదు. కాని ఇప్పటి వరకు అధికారం రుచి చూడని వైకాపాను ప్రతిపక్షంలో వచ్చే ఎన్నికల దాకా నిలబెట్టడం జగన్‌కు అగ్నిపరీక్ష కానుంది. ఈ ఐదేళ్లలో జగన్‌కు చాలా కష్టాలు ఎదురుకానున్నాయి. ఈ ఐదేళ్లలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని నామరూపాలు లేకుండా చేయడమే చంద్రబాబు లక్ష్యంగా మారింది. అందుకోసం అధికారాన్ని ఆయుధంగా వాడుకోబోతున్నాడు. కేంద్రప్రభుత్వ సహకారంతో జగన్ పై (మిగతా 10వ పేజీలో)

# ఘనంగా అన్నమయ్య జయంతి



7లో



## వైకాపా నుండి తెదేపాలోకి... మేయర్ అజీజ్

# అభివృద్ధి కోసమా...? అధికారం కోసమా?

**రాజకీయ నాయకులకు అధికారమే పరమావధిగా మారి పోతోంది. అధికారం లేకుంటే ఇక బ్రతకలేము అన్న భ్రమలకు లోనవుతున్నారు. అధికారపార్టీలో ఉంటేనే భవిష్యత్, లేదంటే చిత్తన్నట్లుగా తయారవుతోంది.**

గతంలోనూ నాయకులు పార్టీలు మారేవాళ్లు. కాని ఎప్పుడు..? తాను ఉంటున్న పార్టీలో సీటు రానప్పుడు, తనకంటే వెనుక వచ్చిన నాయకులకు పెద్దపీట వేస్తున్నప్పుడు. ఇంతకుముందు నాయకులు పార్టీలు మారితే కొంత కారణముండేది. కాని ఇప్పుడు ఒకటే కారణం... ఈ పార్టీ అధికారంలోకి రాలేదు, కాబట్టి అధికారంలో వున్న పార్టీలోకి పోతున్నాను.

ఈ పరంపరలోనే నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ షేక్ అబ్దుల్ అజీజ్ తనకు టిక్కెట్ ఇచ్చి, తనను మేయర్‌ను చేసిన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని వదిలి తెలుగుదేశంపార్టీలో చేరుతున్నారు. ఆయన స్వయంగా ఈ ప్రకటన చేశారు. ఈమేరకు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబును కలవడం కూడా జరిగింది. నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలతో ఉన్న విభేదాలవల్లే తాను తెలుగుదేశంపార్టీలో చేరుతున్నట్లు అజీజ్ ప్రకటించారు. వాస్తవానికి అంత స్థాయిలో విభేదాలుండుంటే మొన్న మేయర్ ఎన్నికల్లో ఎమ్మెల్యేలిద్దరూ అజీజ్‌కు మద్దతుగా ఎలా పనిచేస్తారు?

మున్సిపల్ ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే జరిగాయి. ఫలితాలు కూడా ముందే వచ్చాయి. కాకపోతే రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాతే మేయర్, ఛైర్మెన్‌ల ఎన్నిక జరిగింది. నెల్లూరు నగరపాలక సంస్థలో వైకాపాకు 32డివిజన్‌లు వచ్చాయి. ఇద్దరు ఎమ్మెల్యేల ఓట్లు కూడా తోడయ్యాయి. అయినా

## రవీంద్రభారతి ఒక్కటే అక్రమ నిర్మాణమా...? అనిల్ గార్డెన్స్ కనపడలేదా..??

10లో...

తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావడంతో మేయర్ సీటుపై కన్నేసింది. తెలుగుదేశం నుండి డాక్టర్ జడ్.శివప్రసాద్‌ను మేయర్‌ను చేసేందుకు పార్టీలోని ఓ వర్గం ముమ్మర ప్రయత్నం చేసింది. వైకాపా కార్పొరేటర్లను లాగేందుకు విశ్వప్రయత్నాలు చేసారు. ఓ నలుగురు కార్పొరేటర్లను లాగగలిగారు. ఆరోజు జిల్లా మంత్రి నారాయణ సహకరించి వుంటే మరో ముగ్గురు కార్పొరేటర్లను లాగడం పెద్ద సమస్య కాదు. తెలుగుదేశం అభ్యర్థి జడ్‌యస్ మేయర్ అయ్యుండేవాడు. (మిగతా 10వ పేజీలో)



# రాజధానితో అల్లుకున్న ఆదాయ బంధం

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధాని విషయంలో తన మేధస్సుకు పదును పెడితే అందమైన రాజధానిని ఏర్పాటు చేసుకోవడంతో పాటూ రాష్ట్ర ఆదాయ మార్గాలను పెంచుకునే అవకాశముంటుంది.

రాష్ట్ర రాజధాని ఎంపికకు కులం, వర్గం ప్రాతిపదికలను ముందు పక్కన పెట్టాలి. పదికోట్లు వున్నోడు వంద కోట్లు సంపాదిస్తే అది అభివృద్ధి లెక్కలోకి రాదు. కూటికి గతిలేని నిరుపేద లక్ష రూపాయల ఆస్థిపరుడైతే అది అభివృద్ధి అవుతుంది. గుంటూరు, విజయవాడల మధ్య రాజధాని కోటీశ్వరులను వందల కోట్లకు అధిపతులను చేయడం లాంటిదే! ఈ రెండు నగరాలను అనుసంధానిస్తూ రాజధానిని ఏర్పాటు చేయడం వల్ల సారవంతమైన భూములను కోల్పోవాల్సివస్తుంది, సరికదా ఈ ప్రాంతంలోకి కొత్తగా పరిశ్రమలు గాని, వ్యాపార, వాణిజ్య, విద్య, వైద్య వంటి ప్రైవేట్ సంస్థలు గాని వచ్చే పరిస్థితి ఉండదు. హైదరాబాద్‌లో పేరుమోసిన అంతర్జాతీయస్థాయి హోటళ్లు, హాస్పిటళ్లు, మల్టీప్లెక్స్‌లు, ఐటి ప్రాజెక్ట్, ఇంకా అనేకంగా వాణిజ్య, వ్యాపార, విద్య, వైద్య సంస్థలు వచ్చాయంటే దానికి కారణం అక్కడ భూముల లభ్యతే. కావాల్సినంత భూమి దొరకడమే కాదు సలీసు ధరకు కూడా అందుబాటులో వుండేది. ఈరోజుకీ హైదరాబాద్ పరిసరాలలో ఎకరా 5లక్షలకు కూడా భూములు లభిస్తాయి. అదే విజయవాడ, గుంటూరుల వద్ద అయితే 5లక్షలకు ఒక ఎకరా కాదు కదా ఒక సెంటు భూమి కూడా రాదు. ఈ రెండు నగరాలలో ఏదన్నా ఒక కొత్త సంస్థను స్థాపించాలంటే భూమి కొనుగోలుకే కోట్లాదిరూపాయలు వెచ్చించాల్సి వస్తుంది. మరి ఇక సంస్థలను నెలకొల్పాలంటే? ఒక చిన్న మెడికల్ షాపు, టిఫిన్ కొట్టు పెట్టుకోవాలన్నా కోట్లలో పెట్టుబడి పెట్టాల్సి వస్తే ఇక ఈ నగరాలు అభివృద్ధి చెందేదెక్కడ? అదీగాక ఇక్కడ వున్న సారవంతమైన భూములను భవనాల కోసం ఉపయోగిస్తే వ్యవసాయ ఉత్పత్తులు తగ్గిపోతాయి.




రాష్ట్ర రాజధాని ఎంపికకు కులం, వర్గం ప్రాతిపదికలను ముందు పక్కనపెట్టాలి. పదికోట్లు వున్నోడు వందకోట్లు సంపాదిస్తే అది అభివృద్ధి లెక్కలోకి రాదు. కూటికి గతిలేని నిరుపేద లక్షరూపాయల ఆస్థిపరుడైతే అది అభివృద్ధి అవుతుంది.

దీనికి బదులు నిరుపయోగంగా వున్న వ్యవసాయ యోగ్యం కాని భూములను రాజధానికి ఉపయోగించుకోవడం ఉత్తమం. అది దొనకొండ గాని, మార్కాపురం గాని, అమరావతి గాని, వెంకటగిరి గాని, ఏలూరు గాని... వ్యవసాయ యోగ్యం కాని భూములెక్కడ వున్నాయో ప్రభుత్వం గుర్తించాలి. దాదాపు 50వేల ఎకరాల దాకా మెట్టభూమి ఎక్కడ వుందో చూడాలి. దాంట్లో ప్రభుత్వ, అటవీ భూములుండొచ్చు. రైతులకు సంబంధించిన భూములుంటే వారికి కొంత రేటు కట్టి ఇవ్వొచ్చు. వ్యవసాయ యోగ్యం కాని భూములు కోల్పోవడానికి రైతులు బాధ పడరు. ప్రభుత్వమే భూములు తీసుకుంటుంది కాబట్టి రైతులకు ఎకరాకు 5 నుండి 10లక్షల దాకా ధర నిర్ణయించవచ్చు. దీనివల్ల రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుంది. ప్రభుత్వం 50వేల ఎకరాలను రాజధానికి నిర్ణయించి, అందులో ప్రణాళిక ప్రకారం కేటాయింపులు చేయాలి. ప్రభుత్వ ఆసరాల కోసం 10వేల ఎకరాలను కేటాయించి మిగిలిన 40వేల ఎకరాలను ప్రైవేట్ రంగ సంస్థలకు ఎకరా ఇంత అని రేటు కట్టి అమ్మకానికి పెట్టాలి. గుంటూరు-విజయవాడలలో ఎకరా 10కోట్లు పెట్టి కొనాలంటే ఎవరూ ముందుకురారు. అదే ఇక్కడ ఎకరా భూమిని 30లక్షల నుండి 50లక్షల వరకు పెట్టినా కొనేస్తారు. అలాగే హౌసింగ్ కాలనీలను ఏర్పాటు చేసి విక్రయించవచ్చు. రాజధానిగా ఎంపిక చేసిన ప్రాంతం కాబట్టి వివిధ సంస్థలు, కార్పొరేట్ కంపెనీలు ఇక్కడ భూములను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తారు. ఇలా వచ్చిన ఆదాయంతోనే రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను సులభంగా ఏర్పాటు చేసుకోవచ్చు. దీనివల్ల ఈ పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. వ్యాపార, వాణిజ్య సంస్థలు ఇక్కడకు రావడానికి ఆసక్తి చూపుతాయి.

భూముల లభ్యత ఎక్కడ సరళంగా ఉంటే అక్కడ రాజధాని అభివృద్ధి చెందుతుంది. అంతేగాని ఎకరా భూమి కొనాలన్నా గగనంగా ఉండే గుంటూరు, విజయవాడల్లో రాజధాని పెడితే పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంటుంది.

# నెల్లూరు ట్రాఫిక్‌కు ట్రీట్‌మెంట్!

## ఐలాండ్‌ల కట్టింగ్‌పై ఎస్పీ దృష్టి



హైదరాబాద్‌లో ఐఎస్ఐ టెర్రరిజం, కర్నూలుకు ఫ్యాక్షనిజం, కరీంనగర్‌కు మావోయిజం ఎటువంటి సమస్యో నెల్లూరు నగరానికి ట్రాఫిక్ అలాంటి సమస్య. నెల్లూరులో ఇది ఎప్పటికీ పరిష్కారం చేయలేని సమస్యే! ఎందుకంటే పెరుగుతున్న ఆటోలను, కార్లను, బస్సులను, బైక్‌లను తగ్గించలేం. రోజురోజుకు వాహనాలు పెరిగిపోతున్నాయని చెప్పి రోడ్లను పెంచలేం కదా! ఉన్నరోడ్లను ఇంకా వెడల్పు చేయలేం కదా! పెరిగిపోతున్న ట్రాఫిక్‌ను తగ్గించలేం గాని కొంత క్రమపద్ధతిలో పెడితే ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుందనేది నగ్నసత్యం. పోలీసులు గట్టిగా పనిచేస్తే ఈ ట్రాఫిక్ సమస్యలను అధిగమించడం పెద్ద సమస్య కాదు. వాహనాలను క్రమపద్ధతిలో నడిచేలా చేసి ట్రాఫిక్‌జాం వంటి సమస్యలను నివారించవచ్చు.

నెల్లూరులో ట్రాఫిక్‌కు ప్రధాన సమస్య ఆటోలు. దాదాపు 15వేల ఆటోలున్నాయి. ఇన్ని ఆటోలు మన రాష్ట్రంలో ఇంకే నగరంలోనూ కనిపించవు. ఇక సిటీబస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు వేలసంఖ్యలోనే ఉంటాయి. ఈ ట్రాఫిక్ అంతా కూడా నెల్లూరులో అయ్యప్పగుడి నుండి బోసుబొమ్మ దాకా వున్న ట్రంక్‌రోడ్డు లేదా ఆత్మకూరు బస్టాండ్ నుండి అయ్యప్పగుడి ఫ్లైఓవర్ దాకా వున్న మినీబైపాస్ మీదుగానే తిరగాలి. నగరంలో ఇవి రెండే ప్రధాన రహదారులుగా వున్నాయి. ప్రత్యామ్నాయ మార్గాలు చాలా తక్కువ. ఇక అయ్యప్పగుడి నుండి బోసుబొమ్మ వరకు చూస్తే ట్రంకురోడ్డు చాలా ఇరుకుగా ఉంటుంది. అయ్యప్పగుడి నుండి ఎల్ఐసి ఆఫీసు వరకు రోడ్డు కొంత విశాలంగా వుంది గాని అక్కడి నుండి బోసుబొమ్మ దాకా చాలా వరకు రద్దీగానే వుంటుంది, దీనికి తోడు ట్రంకురోడ్డులో, మినీబైపాస్‌లలో ఆయా విగ్రహాల వద్ద నిర్మించివున్న ఐలాండ్‌లు మరీ పెద్దవి కావడం ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉంటుంది.



కొత్త ఎస్పీగా వచ్చిన సెంథిల్ కుమార్ వీటిపై దృష్టి పెట్టారు. కార్పొరేషన్ పాలకులు, అధికారులు సహకరిస్తే ఐలాండ్‌లను తగ్గించి ట్రాఫిక్‌ను కొంతవరకు దారిలో పెట్టాలనే ఆలోచనలో ఆయనున్నట్లు తెలుస్తుంది.







# పదవుల పరుగులో పెద్దలు



**రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవుల భర్తీకి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పచ్చజెండా ఊపారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం నాయకులలో పదవుల ఆరాటం ఎక్కువైంది. ముఖ్యంగా నెల్లూరుజిల్లాలో అయితే ప్రథమశ్రేణి నాయకులే పదవుల కోసం ఆత్రం పడుతున్నారు. దీనికి కారణం మొన్నటి ఎన్నికల్లో ఎక్కువమంది ఓడిపోయి ఉండడమే. వీళ్లంతా ఎటువంటి పదవులు లేక ఖాళీగా ఉన్నారు. తమ అధికార ప్రతాపం చూపాలంటే ఏదో ఒక పదవిలో ఉండాలి. కాబట్టే ఏదో ఒకటి పదవొస్తే చాలు అన్నట్లుగా ఉన్నారు.**

నెల్లూరు లోక్‌సభ నుండి ఓడిపోయిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇటీవల నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి మృతితో ఖాళీ అయిన రాజ్యసభ స్థానాన్ని ఆశించారు. అయితే దానిని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు కేటాయించారు. దగ్గరలో రాజ్యసభ ఎన్నికలు లేవు. అయితే కొంత ఆలస్యంగానైనాసరే ఆదాలకు రాజ్యసభ అవకాశం ఉన్నట్లు సమాచారం. పార్టీ ప్రతిపక్షంలో వున్న పదేళ్లు పార్టీకి వెన్నెముకగా నిలిచిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎమ్మెల్సీని ఆశిస్తున్నారు. జిల్లాలో పార్టీని నడపాలన్నా, కార్యకర్తలను నిలబెట్టుకోవాలన్నా 24గంటలు అందుబాటులో ఉండే సోమిరెడ్డికి పదవి ఇవ్వడం అవసరం. అయితే త్వరలో గవర్నర్ కోటాలో మంత్రిగా వున్న నారాయణను ఎమ్మెల్సీగా తీసుకోవాల్సి ఉంది. ఈ దృష్ట్యా తొలివిడతలో సోమిరెడ్డికి అవకాశం ఉండకపోవచ్చు. అందుకే ఈలోపు రాష్ట్రస్థాయిలో ఏదో ఒక నామినేటెడ్ పదవి కోసం ప్రయత్నిస్తున్నారు. కావలి నుండి ఓడిపోయిన బీద మస్తాన్‌రావును రాజధాని కమిటీలో వేసారు. ఇక బీద రవిచంద్ర కూడా పార్టీ అధికారంలో ఉంది కాబట్టి రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ ప్రయత్నాలలో ఉన్నారు. నెల్లూరు నగరం నుండి ఓడిపోయిన ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి నెల్లూరు కేంద్రంగా 'నుడా'ను ఏర్పాటుచేసి దాని ఛైర్మెన్ పదవి కావాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. మొన్న ఎన్నికల్లో ఓడిపోయిన పరసా రత్నం, డాక్టర్ జ్యోత్స్నలత, గూటూరు కన్నబాబులతో పాటు సీట్లు త్యాగం చేసిన పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, బల్లి దుర్గాప్రసాదరావు, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి లాంటి నాయకులు కూడా పెద్దస్థాయి నామినేటెడ్ పదవుల ప్రయత్నాలలో ఉన్నారు.

# అమెరికాలో అలరించిన 'బాలార్క' గానం

## --- భక్తిభావ సమన్వితులను చేసిన అన్నమయ్య సంకీర్తనలు ---

నెల్లూరుకు చెందిన సుప్రసిద్ద గాయనీ మణి బాలార్క ఇటీవల అమెరికాలో అన్నమయ్య సంకీర్తనలను, పలు భక్తి గీతాలను అత్యద్భుతంగా గానం చేసి సింహపురి కీర్తిని మరింతగా ఇనుమడింపజేశారు.

తిరుమలేశునికి పరమభక్తుడు, పదకవితా పితామహుడు అయిన శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులవారి సంకీర్తనల్లోని భక్తితత్వాన్ని.. ఆ కీర్తనల మాధుర్యాన్ని వీనులవిందుగా విన్పింపజేశారు. తద్వారా అమెరికాలోని అనేక మంది తెలుగువారి మనసులను భక్తి రసస్పోరకం చేశారు. అట్లాంటాలో జరిగిన నాటా ఉత్సవాల్లో పాల్గొనేందుకు బాలార్క అమెరికా వెళ్ళారు. గత నెల 6న జరిగిన నాటా వేడుకల్లో డాక్టర్ వైఎస్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఆమె అన్నమయ్య సంకీర్తనలను మృదుమధురంగా గానం చేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఎంతో ప్రసిద్దమైన 'అదివో..అల్లదివో హరివాసము'..'నారాయణతే నమో! నమో!'.., 'కొండలలో నెలకొన్న కోనేటి రాయడు'..తదితర అన్నమయ్య సంకీర్తనలను అత్యద్భుతంగా గానం చేసి అందరి కరతాళధ్వనులందుకున్నారు. అదే విధంగా, ఈ పర్యటనలో భాగంగా ఆమె కొలంబస్‌లోని శ్రీ వేంకటేశ్వరాలయంలో స్వామివారికి అభిషేకం సందర్భంగా జరిగిన కార్యక్రమంలోనూ, అనంతరం అక్కడి షిర్డీ సాయి మందిరంలో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలోనూ పాల్గొని అన్నమయ్య సంకీర్తనలతో పాటు, పలు భక్తిగానాలతో అందరినీ భక్తిభావ సమన్వితులను చేశారు. ఈ సందర్భంగా ఆమె గానం చేసిన 'షిర్డీ క్షేత్ర స్థిరవాసా', 'ద్వారకామాయిలో దయగల స్వామీ'.. వంటి భక్తిగీతాలు, 'రామచంద్ర రారా'.. వంటి శ్రీ రామదాసు కీర్తనలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి. అమెరికాలోని బర్మింగ్‌హామ్‌లోనూ జరిగిన గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొని భక్తి సంగీత కచేరీ నిర్వహించారు. ఆ తర్వాత అక్కడున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవంలోనూ పాల్గొని భక్తి గానాలాపనలతో అందరి మన్ననలూ అందుకున్నారు. ఈ సంగీత కచ్చేరీల్లో దీప(వయోలిన్), ప్రశాంత్(ఫ్లూట్), ప్రశాంతి (వీణ), అమిత్ (మృదంగం) వాయిద్యకారులుగా తనకెంతో సహకరించారని బాలార్క ఈ సందర్భంగా తెలియజేశారు. అమెరికాలో అన్నమయ్య సంకీర్తనలు గానం చేయడం, అక్కడి ఆలయాల్లో భక్తిగీతాలు గానం చేసే భాగ్యం కలగడం తన పూర్వజన్మ సుకృతమని, ఈ కార్యక్రమాల్లో తనకు సహకరించినవారందరికీ ఆమె ఈ సందర్భంగా తన కృతజ్ఞతలు తెలియజేశారు.

దాదాపు నెలరోజుల పాటు అమెరికాలో పర్యటించి జులై 29న ఆమె స్వదేశానికి తిరిగివచ్చారు.

కొలంబస్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



కొలంబస్ సాయిబాబా మందిరంలో...



అట్లాంటా వైయస్సార్ ఫౌండేషన్ కార్యక్రమంలో



అట్లాంటా 'నాటా' ఉత్సవాలలో...



బర్మింగ్‌హామ్ హిందూ దేవాలయంలో...



# ధనలక్ష్మీపురం సమస్యలు పరిష్కరిస్తా!



నెల్లూరు నగరపరిధిలో ఉన్న ధనలక్ష్మీపురంలో ప్రధాన కాలువలు నిర్మించడానికి అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి అధికారులను కోరారు. ఈ నెల 7న ఆయన 12వ డివిజన్ పరిధిలో వున్న ధనలక్ష్మీపురం మరియు వావిలేటిపాడు జంక్షన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈ పనులన్నీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ క్రింద శాంక్షన్ కావడం జరిగిందని, కాని ప్రభుత్వాలు మారిన వెంటనే ఆ నిధులన్నీ తాత్కాలికంగా ఆపడం జరిగిందని తెలిపారు. ఈ ఫండ్స్‌ను గతంలో ఆనం వివేకానందరెడ్డి శాసన సభ్యులుగా ఉన్నప్పుడు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఆ నిధులు రాకపోయినా వేరే నిధులు ద్వారా అయినా ఈ పనులు చేయాలని, అవసరమైతే మేయర్, శాసనసభ్యులతో కూడా మాట్లాడుతానని తెలిపారు. ఇటీవల మేయర్, అధికారులే మీ దగ్గరకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తారని చెప్పడం మంచి పరిణామమని తెలిపారు. అదేవిధంగా ఎక్కడెక్కడో చెత్తను వావిలేటిపాడు పొరుదల కాలువ పక్కన వేస్తున్నారని, అలా వేయకుండా అధికారులు ఇక్కడ ఒక తొట్టెను ఏర్పాటు చేయడమో, లేదా వెంటనే ఒక బండిని ఏర్పాటు చేసి చెత్తను ఎత్తివేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రాధాకృష్ణారెడ్డి, రామసుబ్బారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, వాసు, సుబ్బారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

# కిషన్‌రెడ్డిని కలిసిన కర్నాటి

భారతీయ జనతాపార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన కిషన్‌రెడ్డిని, మన జిల్లాకు చెందిన ఏపి రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి ఈ నెల 6న హైదరాబాద్‌లో కలుసుకుని అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంసెట్ కౌన్సిలింగ్ విషయంలో తెలంగాణ ప్రభుత్వం మొండివైఖరి వల్ల ఆంధ్రరాష్ట్రంలోని లక్షలాదిమంది విద్యార్థులు ఆవేదనకు గురవుతున్నారని కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళినట్లు, ఈ విషయంలో ఆంధ్ర రాష్ట్ర విద్యార్థులకు అన్యాయం జరుగకుండా చూడాలని విజ్ఞప్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

### కలెక్టరేట్‌లో మహనీయుల

# విగ్రహాల ఏర్పాటుకు కృషి

జిల్లా ఖ్యాతిని దశదిశలా చాటిన మహాకవి తిక్కన, మహనీయులైన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు, అల్లూరి సీతారామరాజు విగ్రహాలను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ రేఖారాణి పేర్కొన్నారు. ఈ విషయమై కలెక్టరేట్ పరిసరాలను జెసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కలెక్టరేట్ ప్రాంగణం పచ్చదనంతో వెల్లివిరిసేలా వుండాలని అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలను కల్పించేందుకు ఆమె అధికారులకు ఈ సందర్భంగా తగు సూచనలు ఇచ్చారు.

# పర్వదినాలకు ప్రత్యేక రైళ్ళు

రానున్న రాఖీ, వినాయక చవితి పర్వదినాలను పురస్కరించుకుని ప్రయాణీకుల సౌకర్యార్థం దక్షిణమధ్య రైల్వే ఈ నెలలో పలు కొత్తరైళ్ళను ఏర్పాటు చేసింది. ఔరంగాబాద్ నుంచి తిరుపతికి ఆరు రైలు సర్వీసులను, కొచ్చివేలి నుంచి గౌహతికి ఎనిమిది సర్వీసులను ఏర్పాటు చేసింది. ఈ రెండు మార్గాల్లో వెళ్ళే రైళ్ళకు నెల్లూరు, గూడూరు, వెంకటగిరిలలో స్టాపింగ్ సౌకర్యం కల్పించారు. ఈ ప్రత్యేకరైళ్ళ రాకపోకల వివరాలను రైల్వేస్టేషన్లలో తెలుసుకోవచ్చని రైల్వే వర్గాలు పేర్కొన్నాయి.



అభినందన సభలో ప్రసంగిస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

# ఒక్క ఫోన్ కాల్ చెయ్యండి.. స్పందిస్తా!

ఈనెల 5న నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేపట్టిన కృతజ్ఞతా యాత్రలో భాగంగా 18వ డివిజన్ పరిధిలోని హరనాథపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు హరనాథపురం 2వవీధి, నాగసాయి మందిరం వద్ద ఏర్పాటు చేసిన అభినందన సభలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికలో తనని అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలందరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. దివంగత మహానేత వై.యస్.రాజశేఖరరెడ్డి మీద ఉన్న అభిమానం, తనపై ఉన్న నమ్మకంతో ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ఎక్కడికి తిరగాల్సిన అవసరం లేదని గంటలు గంటలు వేచి ఉండాల్సిన అవసరంలేదని తనకు ఒక్క ఫోన్‌కాల్ చేస్తే చాలు అని తన ఫోన్ తన వద్దే ఉంటుందని నేరుగా తానే మాట్లాడుతానని ఒకవేళ మీటింగ్‌లో ఉంటే మిస్డ్‌కాల్ చూసుకొని తిరిగి తానే ఫోన్ చేస్తానని చెప్పారు. పై కార్యక్రమంలో నెల్లూరు నగర ఎమ్.ఎల్.ఏ అనిల్‌కుమార్‌యాదవ్, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీ మేయర్ పులిమి శైలజ, స్థానిక కార్పొరేటర్ దారా సరోజనమ్మ, చింతంరెడ్డి సిద్దారెడ్డి కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పదవులకే వన్నెతెచ్చిన డా॥ బెజవాడ గోపాలరెడ్డి




మహోన్నత నేత స్వర్గీయ డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి జయంతి వేడుకలు ఈ నెల 5న నెల్లూరు దర్గామిట్టలోని డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ జెవిరెడ్డి సభకు అధ్యక్షత వహించారు. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా, ఉత్తర ప్రదేశ్ గవర్నర్‌గా బాధ్యతాయుతమైన పదవుల్లో ఎంతో సమర్థవంతంగా పని చేసి, ఆ పదవులకే వన్నె తెచ్చారని ఆయన ప్రశంసించారు. మహిళాభ్యుదయానికి కూడా ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. తొలుత గోపాలరెడ్డి చిత్రపటానికి పూలమాలికలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అవార్డు కమిటీ కార్యదర్శి బివి నరసింహం మాట్లాడుతూ డా॥ బెజవాడ గోపాలరెడ్డి సాహితీ సేవలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కార్యక్రమంలో ప్రముఖులు సన్నపురెడ్డి రాఘవరెడ్డి, తూపిలి సుబ్బారెడ్డి, విశ్రాంత సహాయ కమిషనర్ టంగుటూరు మహబూబ్. కళాశాల ప్రిన్సిపాల్ వి. మృదుల తదితరులు పాల్గొన్నారు.

# అనిత శారీహౌస్ ప్రారంభం



నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో వున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఇటీవల అనిత శారీ హౌస్ ప్రారంభమైంది. ప్రముఖ వైద్యులు కె.సుప్రజ, చంద్రసేన, సుమతి, శిరీష, కామేశ్వరి తదితరులు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షోరూం అధినేత అనిత మాట్లాడుతూ, సింహపురి మహిళల అభిరుచులకు తగ్గట్టుగా ఈ షోరూం ప్రారంభించామన్నారు. అన్నివర్గాల వారికీ నచ్చే చీరలు, డ్రెస్‌లు, డ్రెస్ మెటీరియల్స్, ఆర్టిఫిషియల్ జ్యువలరీ ఈ షోరూంలో అందుబాటులో వున్నాయన్నారు. వీటితో పాటు టైలరింగ్, ఎంబ్రాయిడరీ కూడా వుంటుందన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు వీరిశెట్టి హజరత్‌బాబు, 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, ధనుంజయ, గౌరినేని శ్రీనివాసులునాయుడు, ఎన్.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రభా'తం

ఒక యుద్ధం ఎంతోమందిని భీతావహులను చేస్తుంది. అయితే, ఒక స్నేహహస్తం మరెంతోమందికి ఆత్మీయతానురాగాలను అందిస్తుంది. ఇరు దేశాల మధ్య ప్రగతికి దారులు వేసే స్నేహవారధి ఆయా దేశాలకే కాక, ప్రపంచానికే మార్గదర్శకమవుతుంది.

శాంతి సామరస్యాలతో జీవించడం, దేశవిదేశాల్లోనూ, ఖండఖండాంతరాల్లోనూ ఎల్లలు లేని స్నేహానురాగాలను అందరికీ పంచడం అన్నది భారతీయ సంస్కృతిలో ఒక భాగం. అలాంటి పవిత్రమైన భారతదేశం నేతగా, దేశ ప్రధానిగా నరేంద్రమోడీ ఇటీవల చేస్తున్న విదేశీపర్యటనలు భారతీయత వుట్టిపడేలా, భరతజాతి గర్వించేలా సాగుతుండడం ఎంతైనా హర్షదాయకం. నిన్న మొన్నటిదాకా మనసులో గూడు కట్టుకుని వున్న విభేదాలు, అనుమానాలు-అపోహల మధ్య నలుగుతున్న నేపాల్‌కు, ప్రధాని మోడీ రాకతో అవన్నీ మటుమాయమైనట్లయింది. ఇప్పుడు నేపాల్‌కు ఒక గట్టి భరోసా దొరికినట్లయింది. తమ దేశ అభివృద్ధికి భారత్ చిత్తశుద్ధితో సహకరిస్తుందనే నమ్మకం వారిలో ఏర్పడింది. ఇరుగు పొరుగు దేశాలతో మైత్రీభావం పెంపొందించుకోవడం, సమస్యలేమైనా వుంటే ఒకరికొకరు సామరస్యంగా పరిష్కరించుకోవడం, అందరం కలసి ప్రగతి బాటలో పయనించేందుకు మార్గాలు వేసుకోవడం..ఇవీ ప్రధాని పర్యటనల్లోని ప్రధాన ఆశయాలుగా వున్నాయి. ఆ ఆశయాలు, ఆకాంక్షలకు తగ్గట్టే ప్రధాని ఇరుగుపొరుగుదేశాల పట్ల ఎంతో గౌరవభావంతో, మంచి మైత్రీ భావంతో వ్యవహరిస్తున్నారు. భారత్‌పై నేపాల్‌కు ఇప్పటిదాకా వున్న అపోహలన్నిటినీ చెరిపేసి, మోడు వారిపోతున్న మైత్రీవృక్షాన్ని చిగురింపజేసి, అది తిరిగి పుష్పఫలభరిత సందోహంతో కళకళలాడుతూ వుండాలని ప్రధాని మోడీ చేసిన నేపాల్ పర్యటన పూర్తిగా విజయవంతమైంది. మోడీ పర్యటనతో నేపాల్-భారత్ మైత్రీబంధాల్లో ఒక సరికొత్త అధ్యాయం ప్రారంభమైనట్లయింది. నేపాల్-భారత్‌ల అనుబంధం హిమాలయాలంత ఉన్నతమైనదని, గంగానది అంతటి పవిత్రమైనదని..అంటూ మోడీ చేసిన అత్యద్భుత ప్రసంగం నేపాల్ నేతలనూ, ప్రజలనూ విశేషంగా ఆకట్టుకుంది.


సరిహద్దులంటే రెండు దేశాల మధ్య స్నేహవారధులు కావాలి కానీ, అడ్డుగోడలు కారాదని ప్రధాని మోడీ ఆకాంక్షించడం... నేపాల్‌లో హైవేల నిర్మాణానికి, సమాచార వ్యవస్థ అభివృద్ధికి..మొత్తంగా నేపాల్ ఒక డిజిటల్ నేపాల్‌గా పురోగతి సాధించడానికి సహకరిస్తామని ప్రధాని మోడీ హామీ ఇవ్వడం ఆ దేశప్రజల సంతోషానికి కారణమైంది. తమ దేశానికి వచ్చి తమ ప్రగతికి సహకరిస్తామని చెప్పడమే కాక, తమ దేశాభివృద్ధికి దాదాపు పదివేల కోట్ల రూపాయలను రుణసాయంగా అందిస్తామని ప్రధాని మోడీ నేపాల్‌కు హామీ ఇవ్వడంతో నేపాల్ ప్రజలు ఆనందతరంగిత మనస్కు లయ్యారు. ఎంతో సహృదయంతో, సదాశయాలతో, ఇరుదేశాల ప్రగతికి మార్గదర్శకంగా వుండేలా ప్రధాని మోడీ నేపాల్‌కు స్నేహహస్తం అందించడాన్ని అందరూ అభినందిస్తున్నారు. నేపాల్-భారత్‌కు సంబంధించి 1950 నాటి స్నేహ ఒప్పందంలో ఏ అంశంపైనైనా ఇబ్బంది వుంటే, దానిని సమీక్షించేందుకు ప్రధాని మోడీ ఈ సందర్భంగా సంసిద్ధతను వ్యక్తం చేయడం, నిర్మాణాత్మక సూచనలతో నేపాల్ ముందుకువస్తే గతంలో చేసుకున్న స్నేహపూర్వకమైన ఒడంబడికను పునస్సమీక్షించేందుకు తాము సిద్ధమేనని ప్రకటించడంతో నేపాల్‌కు ఇన్నాళ్ళూ భారత్‌పై వున్న అపోహలన్నీ పటాపంచలైపోయాయనే భావించవచ్చు. ఈనెల తొలివారంలో రెండు రోజుల నేపాల్ పర్యటనలో ప్రధాని మోడీ..నేపాల్ అధ్యక్షులు రామ్‌బరణ్‌యాదవ్, నేపాల్ ప్రధాని సుశీల్‌కొయిరాలతో చర్చలు జరపడం, ఇరుదేశాల మధ్య వున్న స్నేహ ఒప్పందాన్ని, ఇతర ద్వైపాక్షిక ఒప్పందాలను సమీక్షించి కాలానుగుణ మార్పులు చేయడానికి రెండు దేశాలకు చెందిన ప్రధానులు అంగీకరిస్తూ ఆ మేరకు ప్రకటన కూడా విడుదల చేయడం భారత్-నేపాల్ మైత్రిలో మరో ముందడుగేనని చెప్పవచ్చు. నేపాల్‌లో జాతీయ రహదారుల అభివృద్ధికి, విద్యుత్ రంగంలో సహకారం అందించేందుకు నేపాల్‌కు తమ సహకారం వుంటుందని ప్రధాని మోడీ ప్రకటించడం, నేపాల్‌పై వరాల జల్లు కురిపించడం నేపాల్ నేతల్లోనూ, ప్రజల్లోనూ భారత్‌పై మరింత సుహృద్భావపూర్వకమైన స్నేహవాతావరణానికి దారులు తీసినట్లయిందని భావించవచ్చు.

అంతేకాదు, పెట్రోల్, డీజిల్, విమాన ఇంధన సరఫరాకు బీహార్‌లోని రాక్సాల్ నుంచి ఖాట్మండ్ వరకు పైప్ లైన్ నిర్మించాలని నేపాల్ కోరగా అందుకు భారత్ అంగీకారం తెలియజేసింది. ఈ పర్యటన సందర్భంగా ప్రధాని మోడీ నేపాల్ పార్లమెంట్‌ను ఉద్దేశించి చేసిన ప్రసంగం నేపాల్ ప్రజల హృదయాలను హత్తుకుందని నేపాల్ మావోయిస్టు నేత ప్రచండ సైతం ప్రశంసించారంటే మోడీ ప్రసంగం అక్కడివారినెంత బాగా ఆకట్టుకుందో వూహించుకోవచ్చు. దాదాపు పదిహేడేళ్ళ సుదీర్ఘకాలం తర్వాత నేపాల్‌లో భారత ప్రధాని అధికారిక పర్యటన ఇదే కావడం, అందులోనూ మోడీయే తొలిసారిగా నేపాల్ పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించిన తొలి భారతప్రధాని కావడం కూడా ఎంతైనా విశేషం. ఈ పర్యటన సందర్భంగా ప్రధాని ఖాట్మండులో వున్న ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన శ్రీ పశుపతినాధుని ఆలయాన్ని దర్శించుకోవడం, అక్కడ విశేష పూజలు నిర్వహించి, ఆలయ అభ్యున్నతికి తమ వంతు సహకరిస్తామని హామీ ఇవ్వడం, పశుపతినాథ్ ఆలయంలో ధర్మశాల నిర్మాణం కోసం రూ. 25 కోట్లు ప్రకటించడం మోడీ సహృదయతనే కాక, భారత్ హృదయౌన్నత్యాన్ని చాటేవిధంగా వుంది. ఏదేమైనా ప్రధాని మోడీ రెండు రోజుల నేపాల్ పర్యటన ఇరుదేశాల మైత్రీ భావాన్ని మరింత పెంపొందిస్తూ, ఇరుదేశాల మధ్య మరింత గట్టి సయోధ్యా వారధిగా నిలచిందని భావించవచ్చు.

## స్నేహవారధి



మోడీ పర్యటనతో నేపాల్-భారత్ మైత్రీబంధాల్లో ఒక సరికొత్త అధ్యాయం ప్రారంభమైనట్లయింది. నేపాల్-భారత్‌ల అనుబంధం హిమాలయాలంత ఉన్నతమైనదని, గంగా నది అంతటి పవిత్రమైనదని అంటూ మోడీ చేసిన అత్యద్భుత ప్రసంగం నేపాల్ నేతలనూ, ప్రజలనూ విశేషంగా ఆకట్టుకుంది.




## కేంద్రమే పరిష్కరించాలి

తెలంగాణ సీఎం కేసీఆర్ వైఖరి వల్ల విద్యార్థులు నష్టపోతున్నారు. కేసీఆర్ వైఖరి పాకిస్థాన్ పాలకుల కంటే ఘోరంగా వుంది. తెలంగాణ ఈ దేశంలో భాగం కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. విభజన బిల్లులో పేర్కొన్న అంశాలకు కూడా విలువ నివ్వడం లేదు. కేంద్రం జోక్యం చేసుకుని కేసీఆర్‌ను దారికి తేవాలి.

కె.వి.విఠల్, హైదరాబాద్.

## అది అక్షరసత్యం

చిన్నపిల్లలకు ఒకటో తరగతి నుండే భగవద్గీత, భారతం గురించి చెప్పాలన్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఏఆర్ దవే మాటలు అక్షర సత్యం. భగవద్గీత జీవితసత్యం. అవి ధర్మ మార్గాన్ని బోధిస్తాయి. గీత ఈ దేశానికి జీవనరేఖ. దానికి మతంతో సంబంధం లేదు. గీతను మతం కోణంలో చూడడం భావ్యం కాదు.

సి.రాజీవి, నెల్లూరు.

## వెంటనే చర్యలు చేపట్టాలి

ఎన్నికలలో గెలిచీ, గెలవగానే పార్టీలు మారుతున్న ప్రజాప్రతినిధులపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి. ఇలాంటి వారిపై వెంటనే అనర్హత వేటు వేస్తే భవిష్యత్‌లో పార్టీ ఫిరాయింపులు ఆగిపోతాయి. రాజకీయాల్లో కొంత వరకన్నా విలువలు నిలుస్తాయి.

జి.భాస్కర్‌రావు, గుండుపల్లి.

## పద్మవ్యూహం ఛేదిస్తాడా?

రౌడీయిజం, గూండాయిజం, టెర్రరిజం ఏవీ లేని నెల్లూరులో అంత కంటే పెద్ద సమస్య ట్రాఫిక్ మాత్రం ఎప్పటినుండో తీరని సమస్యగా వుంది. ఎంతోమంది ఎస్‌పిలు వస్తున్నారు, పోతున్నారు. కాని ఈ ట్రాఫిక్‌ను ఎవ్వరూ నియంత్రించలేకపోయారు. ముఖ్యంగా ఆటోల స్వైరవిహారాన్ని అడ్డుకోలేకపోతున్నారు. రోడ్లు ఎంత వెడల్పు చేసినా ఆటో పక్కన ఆటోలు పోతూ వెనుక వాహనాలకు దారి లేకుండా చేస్తున్నాయి. కొత్తగా వచ్చిన ఎస్పీ సెంథిల్ అయినా ఈ ఆటోలపై దృష్టి పెట్టాలి. ఒక క్రమపద్ధతి ప్రకారం ఆటోలు, టౌన్‌బస్సులు రోడ్లపై తిరిగేలా చర్యలు తీసుకోవాలి.

జె.యస్.కృష్ణ, నెల్లూరు.

# 'అంతర్'జాతీయం

- విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను మన దేశంలోకి ఆహ్వానించడానికి నరేంద్ర మోడీ సర్కార్ చేపడుతున్న చర్యలను రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ సమర్ధించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన భారత వర్తకమండలి 86వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరికి ఇష్టం ఉన్నా లేకున్నా ప్రపంచీకరణ ప్రభావం నేపథ్యంలో పెట్టుబడులు పెట్టేందుకు ఏయే దేశాల వద్ద నిల్వలు ఉన్నాయో చూసుకోవాల్సిన అవసరముందన్నారు.
- ప్రపంచంలో తమ దేశం శక్తివంతమైనదే అయినప్పటికి ప్రపంచ వ్యాప్తంగా జరిగే ప్రతి పరిణామంపైన తమ నియంత్రణ ఉండదని అమెరికా అధ్యక్షుడు ఒబామా స్పష్టం చేసారు. గాజా, ఉక్రెయిన్ సంక్షోభాల నేపథ్యంలో తమ దేశ విదేశాంగ విధానాన్ని ఆయన సమర్ధించుకున్నారు.
- భారతీయులు తమ పురాతన సంప్రదాయాల వైపు మళ్లాలని, మహాభారతం, భగవద్గీతలను చిన్నతనం నుండే పిల్లలకు పరిచయం చేయాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.ఆర్.దవే అభిప్రాయపడ్డారు. తానే కనుక నియంతనై వుంటే ఒకటో తరగతి నుండే భారతం, భగవద్గీతలను పాఠ్యాంశాల్లో పెట్టించే వాడినన్నారు.
- నైరుతి చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లో ఈ నెల 3వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు శక్తివంతమైన భూకంపం సంభవించింది. ప్రకంపనల తీవ్రతకు 1200 ఇళ్లు కూలిపోగా 175మంది మరణించారు. 1400మంది గాయపడ్డారు. 181మంది గల్లంతయ్యారు.
- కొత్తతరం ఖండాంతర క్షిపణిని చైనా రూపొందించింది. ఇది 12వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేధించగలుగుతుంది.
- ఇటీవల ప్రకటించిన లోక్‌పాల్ నిబంధనలను అనుసరించి అఖిలభారత సర్వీసుల అధికారులంతా సెప్టెంబర్ 15వ తేదీ లోగా తమ ఆస్థిపాస్తులను వెల్లడించాలని కేంద్రం స్పష్టం చేసింది. ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిక ప్రాంతాలు కూడా తమ పరిధిలోని ఐఏఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ తదితర అధికారుల నుండి ఈ వివరాలు సకాలంలో వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేసింది.
- ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన వివిధ కేసులను కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఏకపక్షంగా ఉపసంహరిస్తున్నాయంటూ ఎన్నికల సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ కేసులను అర్ధవంతంగా ముగించకుండా ఉపసంహరించడం తగదని స్పష్టం చేసింది.

# వార్త - వ్యాఖ్య

వార్త :- మాట్లాడుకుని పరిష్కరించుకోండి.
– ఇరు రాష్ట్రాల సీఎంలకు కేంద్ర మంత్రి వెంకయ్య సూచన.
**వ్యాఖ్య :- *మాట్లాడుకోవడం కంటే పోట్లాడుకోవడమే వారికి బాగున్నట్లుంది.***

వార్త :- ఎర్రచందనం వేలం ఆలస్యం.
**వ్యాఖ్య :- *దీన్ని చూపి ఋణమాఫీని కూడా ఆలస్యం చేస్తారేమో!***

వార్త :- రైతు ప్రయోజనాలే ముఖ్యం. – కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ.
**వ్యాఖ్య :- *60ఏళ్లుగా అధికారంలో వున్నవారంతా ఇదే చెబుతున్నారు... డైలాగ్ మార్చండి.***

వార్త :- రాజకీయాలు విరమించుకోవడమో, జైలు కెళ్లడమో జగన్ తేల్చుకోవాలి.
– మంత్రి పత్తిపాటి.
**వ్యాఖ్య :- *రాజకీయాలు విరమించుకోమని బెదిరించడమా!***

వార్త :- కాపుల సహకారంతోనే తెదేపా అధికారంలోకి.
– ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్.
**వ్యాఖ్య :- *మిగతా వాళ్లవి ఓట్లు కాదా!***

వార్త :- మహిళలు శక్తిస్వరూపిణులు. – మంత్రి సుజాత.
**వ్యాఖ్య :- *అవును... తిరగబడితే ఆదిపరాశక్తులే!***

వార్త :- ఈసారి బడ్జెట్ లక్ష కోట్లు. – ఆర్థికమంత్రి యనమల.
**వ్యాఖ్య :- *నోట్లేమన్నా చెట్లకు కాస్తున్నాయా ఏంటి?***

వార్త :- రెండో రాజధాని సీమలోనే ఏర్పాటు చేయాలి. – మంత్రి సునీత.
**వ్యాఖ్య :- *మొదటి రాజధాని కట్టే సరికే తెల్లారేటట్లుంది లేండి.***

వార్త :- కాంగ్రెస్‌లో ప్రియాంకకు ముఖ్యబాధ్యతలు.
**వ్యాఖ్య :- *రాహుల్‌ను లాభం లేదనుకున్నారా?***

వార్త :- పాత బస్సులతో ఆర్టీసీకి నష్టాలు.
– రవాణా మంత్రి సిద్ధా రాఘవరావు.
**వ్యాఖ్య :- *కొత్త బస్సులు వచ్చినా లాభాలకు గ్యారంటీ ఉందా?***



# మాటలు చేతలుగా మారుతున్న వేళ

కృష్ణపట్నం పరిసర ప్రాంతాల్లో పలు థర్మల్‌స్టేషన్‌లు నిర్మాణంలో వున్నాయి. ఇప్పటికే 2400 మెగావాట్ల సామర్థ్యంతో ఏపి జెన్‌కో థర్మల్‌కేంద్రం నిర్మాణంలో వుంది. మరోవైపు రిలయన్స్ అల్ట్రా మెగాపవర్ ప్రాజెక్టు కూడా సాంకేతికపరమైన ఇబ్బందులను అధిగమించి పూర్తిస్థాయిలోఉత్పత్తికి సిద్ధమయ్యే ప్రయత్నాల్లో వుంది. ఇక్కడ థర్మల్‌కేంద్రాలతో పాటు ఇతర పరిశ్రమల ఏర్పాటుకు కూడా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని తెలుస్తోంది.

✷ ప్రగతి పట్టాలెక్కనున్న జిల్లా

✷ పారిశ్రామికాభివృద్ధికి ప్రతిపాదనలు... ప్రణాళికలు

నేతల మాటలు ఇన్నాళ్ళకి చేతలుగా మారుతున్నాయి. ఇన్నేళ్ళుగా అదిగో..ఇదిగో అంటూ వూరిస్తున్న అభివృద్ధి ఇక చేరువలోకి రాబోతోంది. ఆ మేరకు జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందించడంలో నిమగ్నమైంది. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం, దేశంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడడం, ప్రధాని నరేంద్రమోడీ సారథ్యంలో దేశ వ్యాప్తంగా అభివృద్ధికి అనేకానేక పథకాలు ఆచరణలోకి వస్తుండడం, ఈ జిల్లాకు చెందిన బిజెపి జాతీయనేత ముప్పవరపు వెంకయ్యనాయుడు కేంద్రమంత్రి కావడం అదే సందర్భంగా ఈ జిల్లాకు చెందిన ప్రముఖ విద్యావేత్త డాక్టర్ పి.నారాయణ రాష్ట్ర మునిసిపల్ మంత్రి కావడం ఇవన్నీ జిల్లాకు కలిసొచ్చిన అదృష్టాలుగానే భావించవచ్చు.

అటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇటు కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుల చొరవతో రాష్ట్రంలో అనేక పథకాలు రూపుదిద్దుకుంటున్నాయి. రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో భాగంగా, ఈ జిల్లాకు కూడా పలు అభివృద్ధి పథకాల మంజూరుకు అవకాశం ఏర్పడుతోంది. దీంతో, అటు జిల్లాకు, ఇటు నగరానికీ మంచి రోజులు వచ్చినట్లేనని భావించవచ్చు. రాష్ట్ర విభజనానంతరం ఏర్పడిన పలు సమస్యలను సమర్థవంతంగా అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు కసరత్తు చేస్తూనే, జిల్లాల్లో వున్న వనరులను సద్వినియోగం చేసుకుని, తద్వారా ఆయా జిల్లాల్లో వున్న సమస్యలను పరిష్కరించి, జిల్లాలను ప్రగతిపథంలో పయనింపజేసేందుకు వున్న అన్నిరకాల మార్గాలను ప్రభుత్వం అన్వేషిస్తోంది. ఏపి ప్రాంతాల్లో ఎలాంటి ప్రాజెక్టులు, పథకాలు అమలుచేస్తే ప్రజలకు ప్రయోజనకరంగా వుంటుందో తెలుసుకునేందుకు ఆయా జిల్లాల నుంచి వివరాలను రాబడుతోంది.

ఈ నేపథ్యంలో, మన జిల్లాకు సంబంధించినంత వరకూ ఇప్పటికదాకా కాగితాల్లోనో, ప్రతిపాదనల కవిలెకట్టల్లోనో మూలనపడివున్న అనేక పథకాలు ప్రభుత్వ పరిశీలనలోకి వస్తున్నాయి. వాటిలో అనువైన వాటిని ఎంపికచేసే ప్రయత్నాలను ప్రభుత్వం ముమ్మరం చేస్తోంది. ఎంతో చరిత్రాత్మకమైన ఈ జిల్లాలో వనరులకు కొదవలేదు. అటు వ్యవసాయ పరంగా, పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధికి ఎన్నో మార్గాలున్నాయి. వీటితో పాటు సముద్రతీర ప్రాంతం ఈ జిల్లాకు ఒక వరం. ఇప్పటికే కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడి చొరవతో నెల్లూరు నగరాన్ని స్మార్ట్‌సిటీగా రూపుదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయి. నెల్లూరు నగరానికి ఎంతో కాలంగా పెద్ద సమస్యగా వున్న మురుగునీటి అవస్థలను అరికట్టేందుకు భూగర్భడ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యేందుకు కృషి జరుగుతోంది. నెల్లూరు రూరల్‌లోని పడారుపల్లిలో ఎఫ్ఎం రేడియోకేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన జరుగుతోంది. ఇది కూడా వెంకయ్యనాయుడు చొరవ వల్లనే. అదేవిధంగా, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం సాయంతో మరిన్ని పథకాలను ఆచరణలోకి తీసుకురావాలని భావిస్తోంది. కృష్ణపట్నంను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామని కేంద్రం ప్రకటించడం, ఆ మేరకు బడ్జెట్‌లో ప్రతిపాదించడం కూడా తెలిసిందే.

కృష్ణపట్నం పరిసర ప్రాంతాల్లో పలు థర్మల్ స్టేషన్‌లు నిర్మాణంలో వున్నాయి. ఇప్పటికే 2400 మెగావాట్ల సామర్థ్యంతో ఏపి జెన్‌కో థర్మల్‌కేంద్రం నిర్మాణంలో వుంది. మరోవైపు రిలయన్స్ అల్ట్రా మెగాపవర్ ప్రాజెక్టు కూడా సాంకేతికపరమైన ఇబ్బందులను అధిగమించి పూర్తిస్థాయిలోఉత్పత్తికి సిద్ధమయ్యే ప్రయత్నాల్లో వుంది. ఇక్కడ థర్మల్‌కేంద్రాలతో పాటు ఇతర పరిశ్రమల ఏర్పాటుకు కూడా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని తెలుస్తోంది. కృష్ణపట్నంను పారిశ్రామిక కారిడార్‌గా రూపొందించాలనే ప్రయత్నాలు ఆచరణలోకి వచ్చి తగు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. ఇదిలావుంటే, జిల్లాలో తడ నుంచి తెట్టు దాకా సుమారు 172 కిలోమీటర్ల మేరకు సముద్రతీర ప్రాంతం వుండడం ప్రకృతి ప్రసాదించిన ఒక వరంగా చెప్పుకోవచ్చు. తీరప్రాంతాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా ఆయా ప్రాంతాల్లో ఎంతో ప్రగతిని సాధించవచ్చన్నది ప్రభుత్వ ధ్యేయంగా వుంది. కృష్ణపట్నంను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేయడం, తీరప్రాంతాల ప్రజలకు, మత్స్యకారుల అభ్యున్నతికి ఉపయోగపడే విధంగా ఫిషింగ్ హార్బర్‌ను ఏర్పాటు చేయాలనే సంకల్పమూ వుంది. బోగోలు మండలంలో ఫిషింగ్ హార్బర్‌ను ఏర్పాటుచేయాలనే ప్రతిపాదనలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అదే విధంగా, జిల్లాలో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న విమానాశ్రయ నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు సిద్ధమవుతుండడం సంతోషదాయకం. గతంలో దగదర్తి మండలంలో ఈ ఏర్పాటుకు కొంత ప్రయత్నం జరిగింది. ఇప్పుడు ఆ ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో, కొడవలూరు మండలంలో ఇఫ్కో కిసాన్‌సెజ్‌కు కూడా మంచి రోజులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక్కడ యూరియా కర్మాగారం నెలకొల్పేందుకు వున్న అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కొండాపురం మండలంలోని చింతలదీవిలో వున్న మిశ్రమ పశుగణాభివృద్ధి క్షేత్రం అభివృద్ధికి, అక్కడ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు, పశు పరిశోధనల కేంద్రం నెలకొల్పేందుకు పరిశీలనలు ప్రారంభమైనట్లు సమాచారం. ఏదేమైనా, జిల్లాను అన్ని రంగాల్లో ప్రగతి దారి పట్టించేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతుండడం సంతోషకరం. నేతలు ఎన్నికల ముందు చెప్పిన మాటలు నీటిమూటలుగానే వుండక, అవి చేతలుగా మారి ఆచరణలోకి వస్తుండడం ఎంతైనా ఆనందదాయకం..అభినందనీయమే!..

కీ॥శే॥ ఇఎన్‌టి స్పెషలిస్ట్ డాక్టర్ వెంకటరమణారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా...

# వీఆర్‌సి మైదానంలో ఉచిత వైద్యశిబిరం



నెల్లూరులోని వీఆర్ కళాశాల మైదానంలో ఈనెల3న కీ॥శే॥ ఇఎన్‌టి స్పెషలిస్ట్ డాక్టర్ ఏ.వెంకటరమణారెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని వి.ఆర్.సి వాకర్స్ అసోసియేషన్ ఉచిత వైద్యశిబిరం నిర్వహించింది. డాక్టర్ వెంకటరమణారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎ.పెంచలయ్య, డాక్టర్ సి.భాస్కర్ రావులు మాట్లాడుతూ డాక్టర్ వెంకటరమణారెడ్డి ఉపాధ్యక్షులుగా వీఆర్‌సి వాకర్స్ అసోసియేషన్‌కు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు చేసిన సేవలను కొనియాడారు. అసోసియేషన్ అధ్యక్షులు కనమర్లపూడి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రతిఏటా డాక్టర్ వెంకటరమణారెడ్డి వర్ధంతి రోజున ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి రోగులకు బి.పి., మధుమేహ పరీక్షలు నిర్వహించి డాక్టర్లచే సలహాలు అందిస్తామన్నారు. మైదానంలో నడిస్తే పోయేదేమీ లేదు అనారోగ్యం తప్ప అని పేర్కొన్నారు. అందుకే ప్రతి ఒక్కరు ఉదయం పూట నడక అలవాటు చేసుకోవాలని సూచించారు. ముఖ్య అతిథి, రెడ్‌క్రాస్ కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్ పాల్గొని మాట్లాడుతూ ఇప్పటి వరకు రక్తం అవసరమైన వారికి వారు రక్తాన్ని ప్రత్యామ్నాయంగా ఇస్తే మాత్రమే ఇచ్చే పాతపద్ధతి ప్రకారం కాకుండా రక్తం అవసరమున్న వారికి వెంటనే అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శిబిరంలో డాక్టర్లు వై.రాము, ఎస్.ఎన్.రాజు, ఈశ్వరరెడ్డి, ఎం.ఎస్.రెడ్డి, జగన్మోహన్‌రావు, బసవయ్యలు 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి సూచనలు ఇచ్చారు. నేతాజీ సుబ్బారెడ్డి, వెంకన్నబాబు, తులసి వెంకటేశ్వర్లు, మూర్తి, జె.వెంకటేశ్వరరావులు కార్యక్రమంలో పాల్గొనగా మెడికల్ క్యాంప్ కన్వీనర్‌గా రమణమూర్తి వ్యవహరించగా అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యం, కార్యదర్శి వెంకటరావులు పర్యవేక్షించారు.

# యానాదులను ప్రత్యేక గిరిజన తెగగా గుర్తించాలి



మంత్రి నారాయణకు వినతిపత్రం సమర్పిస్తున్న యానాది సమాఖ్య సభ్యులు

రాష్ట్రంలో యానాదుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఆర్‌డి స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ షేక్ బషీర్, జిల్లా యానాది సమాఖ్య అధ్యక్షురాలు మల్లిక శైలజ, ఉపాధ్యక్షురాలు బాపట్ల సత్యవతిలు ఈ నెల 3న మున్సిపాలిటీ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణను నెల్లూరులోని ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 8,80,000మంది జనాభా కల్గిన యానాదులను అత్యంత వెనుకబడిన ప్రత్యేక గిరిజనతెగగా గుర్తించి కేంద్రప్రభుత్వం నిధులను వారి అభివృద్ధి కోసం కేటాయించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 50వేల గిరిజన జనాభా కల్గిన జిల్లాలను గుర్తించి యానాదుల కోసం ప్రత్యేక ఐటిడిఏను ఏర్పాటు చేయాలని విన్నవించామన్నారు. వారి వెంట కోశాధికారి మొలకల విజయసాయి, మల్లిక వెంకయ్య, బాలకృష్ణ తదితరులున్నారు.

# బీజేపీని బలోపేతం చేద్దాం

బిజెవైయం నగర పదాధికారుల సమావేశంలో నేతలు



నెల్లూరు మినీబైపాస్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో భారతీయ జనతాయువ మోర్చా(బిజెవైఎం) నగర పదాధికారుల సమావేశం ఈ నెల 2న జరిగింది. బిజెవైయం నగర అధ్యక్షుడు మన్నెం మధుసూదన్‌రావు సభకు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, నగర అధ్యక్షులు మండ్ల ఈశ్వరయ్యలు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ నగరంలో అన్ని డివిజన్లలో బిజెవైయం యువతను పార్టీలోకి ఆహ్వానించి కమిటీలను ఏర్పాటు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ప్రజలకు వివరించి ప్రభుత్వ ఫలాలు అర్హులైన వారికి అందేలా చూడాలని పేర్కొన్నారు. నగర అధ్యక్షులు మండ్ల ఈశ్వరయ్య మాట్లాడుతూ డివిజన్‌లోని కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో వుండి స్థానిక సమస్యలను పరిష్కరించే దిశలో పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో బిజెవైయం జిల్లా అధ్యక్షులు మొగరాల సురేష్, రాష్ట్ర కార్యదర్శి టి.మమతారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్.యుగంధర్, నగర ప్రధాన కార్యదర్శులు బి.నాగరాజకుమార్, పి.శివ, నగర కోశాధికారి ఆర్.రమేష్‌రెడ్డి, జిల్లా కోశాధికారి ఎన్.సి.పెంచలయ్య, నగర ఉపాధ్యక్షులు సురేష్, దిలీప్, చైతన్యలు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడకాన్ని నివారిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



బుజబుజనెల్లూరులో ఈ నెల 4న పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, రత్నమ్మ ఛారిటబుల్ సొసైటీ సంయుక్త నిర్వహణలో శ్రీనివాస ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులతో "ప్లాస్టిక్ వాడకాన్ని నివారిద్దాం" అంటూ ర్యాలీ జరిపారు. ర్యాలీలో విద్యార్థులు "ప్లాస్టిక్ వాడకాన్ని నివారిద్దాం - పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అంటూ నినాదాలిచ్చారు. ఈ సందర్భంగా స్కూలు కరస్పాండెంట్ ఎన్.వి.సుబ్బయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులను వాడడం ఆపేసి ఆరోగ్యవంతమైన జీవనానికి బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.సుస్మిత తదితరులు పాల్గొన్నారు.



## నారాయణను కలిసిన జిల్లా ఎస్పీ

జిల్లా ఎస్పీ ఎస్.సెంథిల్‌కుమార్ ఈనెల 3న నెల్లూరులోని పినాకిని అతిథిగృహంలో రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛామిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. భద్రత, రక్షణ, రవాణా, నగర రహదారుల రద్దీ నియంత్రణలు తదితర అంశాలపై ముప్పై నిమిషాల పాటు వీరిద్దరూ చర్చించినట్టు సమాచారం.

## అభివృద్ధికి సహకరించండి



### వెంకయ్యను కలిసిన బొమ్మిరెడ్డి

హైదరాబాద్‌లో ఈనెల 2న కేంద్రమంత్రి వెంకయ్య నాయుడుని నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధికి రూ॥ 100కోట్ల నిధులు మంజూరుకు సహకరించమని ఆయనను బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి కోరారు. దీనికి వెంకయ్యనాయుడు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. పారిశుద్ధ్యం, మంచినీరు, పాఠశాల భవనాల మరమ్మత్తులు మొదలగు జిల్లా అభివృద్ధి పనులకు నిధులు విడుదల అయ్యేటట్లు కృషి చేయాలని కోరానన్నారు.

### పేద కళాకారులకు

## ఆడిటర్ల ఉచిత సరుకుల పంపిణీ



స్థానిక వర్ధమాన సమాజం గ్రంథాలయం మిద్దె పైన ఈనెల 3న సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో 40 మంది పేద కళాకారులకు నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేదిక అధ్యక్షులు దగ్గుపాటి రాధాకృష్ణ మాట్లాడుతూ సేవాతత్పరతగల ఆడిటర్లు ఫలసరుకులను వితరణ చేసారని తెలిపారు. జిల్లాలోని పలుప్రాంతాలకు చెందిన రంగస్థల, సాంఘిక నటీనటులు గాయకులు, వాయిద్య కళాకారులు సరుకులను పొందారు.

చార్టర్ అకౌంటెంట్లుయిన జె.వి.చలపతిరావు, ఐ.సుధాకర్‌రావు, జి.మురళీకృష్ణారెడ్డి, చిన్ని నారాయణరావు, కె.భీమారావు, ఎ.పుండరీకాక్షం, కొంజేటి శ్రీనివాసులు, కొప్పవరపు చంద్రశేఖర్, శ్రీరామ్‌సతీష్, యస్.ప్రసాద్‌రావులు పాల్గొని తమ చేతుల మీదుగా లబ్ధిదారులకు సరుకులను పంపిణీ చేసారు. నరాల సమస్యతో బాధపడుతున్న పోలియో వ్యాధిగ్రస్తురాలు సాయిరేఖ వైద్య చికిత్సల నిమిత్తం, ఆ బాలిక తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు ఆడిటర్లు స్పందించి పదివేల రూపాయల విరాళం ప్రకటించారు. కార్యక్రమ ప్రారంభంలో ఔత్సాహికులు ఆలపించిన సినీగీతాలు, పద్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సృజనకవి రాయప్రోలు రామకృష్ణ, ఎస్ఎస్ఎఫ్‌సి ఫౌండర్ విష్ణుకుమార్, టివి నటులు శింగంశెట్టి మురళీ, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు సయ్యద్ సిరాజ్, జి.బాబూరావు, కందికట్టు వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇన్సులిన్ ఉచిత పంపిణీ

ఇన్సులిన్ బ్యాంక్ వ్యవస్థాపకులు డా॥ ఈదూరు సుధాకర్ ఆధ్వర్యంలో నెల్లూరులోని నవీన్ దయాబెటిస్ క్లినిక్‌లో ఈ నెల 4న దాత ఏడెం రామ్‌మోహన్, తమ తండ్రి ఏడెం వెంకురెడ్డి స్మారకంగా 22 మంది మధుమేహ బాలబాలికలకు ఉచితంగా ఇన్సులిన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్సులిన్ బ్యాంక్ వ్యవస్థాపకులు డా॥ ఈదూరు సుధాకర్ మాట్లాడుతూ విరాళాలు ధన రూపంలో స్వీకరించబడవని, దాతలు ఇన్సులిన్ బుడ్లు(ఇంజెక్షన్లు) ఇచ్చి బిడ్డలను బ్రతికించాలని, మధుమేహమున్న పిల్లలకే కాకుండా గర్భవతులకు కూడా ఇన్సులిన్ ఇంజక్షన్లు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు ఈతకోట సుబ్బారావు, ఏటూరు నాగేంద్రరావు, ఇన్సులిన్‌బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్పీ కొనసాగేనా?

జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ సెంథిల్‌కుమార్ ఎంతకాలం ఇక్కడ పని చేస్తాడనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇంతవరకు ఆంధ్ర, తెలంగాణల మధ్య ఐఏఎస్, ఐపిఎస్ అధికారుల విభజన జరగలేదు. ఏ అధికారి ఏ రాష్ట్ర పరిధి లోకి వస్తారో తెలియదు. తమిళనాడుకు చెందిన సెంథిల్‌కుమార్‌కు ఆంధ్రాను కేటాయిస్తే నెల్లూరుజిల్లా ఎస్పీగానే కొన సాగే అవకాశముంది. అలాకాకుండా తెలంగాణకు కేటాయిస్తే నెల్లూరుకు కొత్త ఎస్పీ రాక తప్పదు.

## రభస ఆడియో విజయోత్సవం



టాలీవుడ్ ఆల్‌రౌండర్ జూనియర్ ఎన్టీఆర్ నటించిన "రభస" చిత్రం ఆడియో విజయవంతమైన సందర్భంగా ఈ నెల 3న నెల్లూరులోని నర్తకి థియేటర్ ఆవరణలో జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ సిటీ ప్రెసిడెంట్ కె.గంగాధర్ ఆధ్వర్యంలో విజయోత్సవం జరిగింది. 'నర్తకి' మేనేజర్ సాగర్ శ్రీనివాసులురెడ్డి కేక్ కట్ చేసి జూనియర్ ఎన్టీఆర్ సిటీ ఫ్యాన్స్ సభ్యులకు పంపిణీ చేసి ఆనందాన్ని వ్యక్తపరిచారు. కార్యక్రమంలో ఫ్యాన్స్ కె.సాగర్‌బాబు, పెంచలయ్య బ్రదర్స్, బాలు, వెంకట్, రూపేక్, మోహన్‌బాబు, డేవిడ్ రాజేష్, దిన తదితరులు పాల్గొన్నారు.

## చేపల మార్కెట్‌లో తనిఖీలు

నగరంలోని చేపల మార్కెట్‌లో ఈ నెల 3న తూనికలు కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి అనుమతి లేని కాటాలు, తక్కెడలను స్వాధీనం చేసుకుని, తక్కువ తూకాలతో వినియోగదారులను మోసగిస్తున్న పలువురు వ్యాపారులపై కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించారు. ఈ దాడుల్లో తూనికలు కొలతల శాఖ అధికారి ఆర్ ప్రభుకుమార్, ఆ శాఖ ఇన్స్‌పెక్టర్లు మల్లేశ్వరరావు, కెవిఎస్ రామకృష్ణ, సలీంలు పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరమ్మ ఆదాయం

నెల్లూరు దర్గామిట్టలోని రాజరాజేశ్వరి ఆలయంలో ఈనెల 2న హుండీ లెక్కింపు జరపగా ఈ యేడు జూన్ 2 నుంచి ఆగస్టు 2 వరకు భక్తులు రూ॥ 9,37,695 కానుకల రూపంలో సమర్పించారని ఆలయ ఈఓ పాయసం నాగేశ్వరరావు తెలిపారు. లెక్కింపులో దేవాదాయ అసిస్టెంట్ కమీషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్, ఆలయ తనిఖీ అధికారులు వెంకటరమణ, రవీంద్ర, రాజరాజేశ్వరి అమ్మ వారి సేవాసమితి అధ్యక్షులు నన్నపరెడ్డి పెంచలరెడ్డి, నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# నెల్లూరు కబుర్లు

## మంత్రుల సందడి

రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చాక నెల్లూరుజిల్లాలో ఈ వారంలో తొలిసారిగా మంత్రుల సందడి కనిపించింది. రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి రవీంద్ర, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావుతో పాటూ జిల్లా మంత్రి, మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ కూడా ఈ జిల్లాలో ఏర్పాటుచేసిన పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. మంత్రులకు పార్టీ కార్యకర్తలు, నాయకులు కట్టిన స్వాగత ఫ్లెక్సీలకంటే కులసంఘాలు, కులపరమైన అభిమానంతో కట్టిన ఫ్లెక్సీలే ఎక్కువగా కనిపించడం విశేషం.

## అలరిస్తున్న సంగమమ్ క్రాఫ్ట్‌మేళా



సంగమమ్ క్రాఫ్ట్ మేళా వారి చేనత హస్తకళా మరియు పుస్తకప్రదర్శన నెల్లూరు ట్రంకురోడ్డులోని టి.వి.యస్. కల్యాణసదన్‌లో ఈ నెల 2వ తేదీ నెల్లూరు నగర శనాసన సభ్యులు డా॥ పి.అనిల్‌కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగరంలో హస్తకళా వస్తువులు, చేనేత వస్త్రాలను, బ్రాండెడ్ షర్ట్స్, జైపూర్ కాటన్, పుస్తకప్రదర్శనను ఒకే చోట చేర్చి ప్రదర్శన, అమ్మకాలు నిర్వహించేలా ఏర్పాటు చేసిన నిర్వాహకులు జి.ఆనంద్‌ను అభినందించారు. జి.ఆనంద్ మాట్లాడుతూ 1గ్రాము గోల్డ్ ఐటమ్స్, బ్రాండెడ్‌షర్ట్స్, ఎడ్యుకేషనల్ సిడిలు అన్ని వర్గాల వారికి సంబంధించిన పుస్తకాలు అందుబాటు ధరలతో తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో వేలూరు మహేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## నగరాన్ని గ్రీన్‌సిటీగా చేద్దాం

**- డాక్టర్ జడ్ఎస్ పిలుపు**



నెల్లూరు నగరాన్ని గ్రీన్‌సిటీగా చేసుకుందామని, మొక్కలు విరివిగా నాటడం ద్వారా పచ్చదనాన్ని పరిరక్షించుకోవచ్చని తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జడ్.శివప్రసాద్ పిలుపు నిచ్చారు. ఈ నెల 3న తెలుగు సాంకేతిక విభాగం ఆధ్వర్యంలో నగరంలోని మాగుంట లేఅవుట్‌లో వున్న లెక్చరర్స్ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు, జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామని ఆయన అన్నారు. నగరాన్ని గ్రీన్‌సిటీగా మార్చేందుకు ముఖ్యమంత్రి సూచన మేరకు నగరంలో రోడ్లకు ఇరువైపులా చెట్లు నాటే కార్యక్రమాన్ని ఈ సందర్భంగా తెలుగు సాంకేతిక విభాగం ఆధ్వర్యంలో ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు నూనె మల్లికార్జునయాదవ్, దాసరి రాజేష్, బొల్లినేని శ్రీవిద్య, టిడిపి నాయకులు అన్నం దయాకరగౌడ్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు తిరుమలనాయుడు, అమ్ములూ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరుకు చేరుకున్న టిటిడి ప్రచార రథం

తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న మనగుడి కార్యక్రమానికి ముమ్మరంగా ప్రచారం నిర్వహించి దిగ్విజయం చేసేందుకు, టిటిడి ప్రచార రథం ఈ నెల 3న నెల్లూరుకు చేరుకుంది.

ఈ నెల 8వ తేదిన జరుగనున్న మనగుడి కార్యక్రమం వివరాలను ప్రజలకు తెలియజేసేందుకు, ప్రజల్లో భక్తిభావం పెంపొందించేందుకు ఈ ప్రచార రథం ఎంతగానో దోహదం చేస్తోంది. ప్రచార రథం రాగానే, నగరంలోని టిటిడి కల్యాణమండపంలో రథానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రథంలో కొలువైవున్న తిరుమలేశుని దర్శించుకున్నారు. అనంతరం రథం మాగుంట లేఅవుట్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం, రంగనాయకులపేటలోని శ్రీ రంగనాథాలయం, మూలాపేటలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయాల వద్దకు చేరుకుంది. అక్కడి అర్చకులు రథానికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ధర్మప్రచారమండలి అధ్యక్షుడు సివి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఆసిఫ్ బాషా

నెల్లూరు ఆర్టీసీ డిపో-2 సంబంధిత మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఈనెల 2న షేక్ ఆసిఫ్ బాషాను గౌరవాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆసిఫ్‌బాషా మాట్లాడుతూ మైనార్టీ కార్మికుల సంక్షేమానికి పాటుపడతానని అలాగే డిపో కార్మికులకు అండగా నిలిచి సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేస్తానన్నారు.

# చింతలదేవికి మంచిరోజులు

--- పశుగణాభివృద్ధి క్షేత్రాన్ని పరిశీలించిన మంత్రి నారాయణ ---



కొండాపురం మండలంలోని చింతలదేవిలో వున్న మిశ్రమ పశుగణాభివృద్ధి క్షేత్రానికి మంచిరోజులు రానున్నాయి. ఇక్కడ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసేందుకు అవసరమైన వసతులు వున్నాయని, చింతలదేవి అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ అన్నారు. ఈ నెల 3న మంత్రి పి.నారాయణ చింతలదేవి పశుగణాభివృద్ధి క్షేత్రాన్ని సందర్శించారు. ఇక్కడ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించిన వసతులపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడులకు నివేదిక పంపించవలసిందిగా వారు కోరారని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పాల్గొని మాట్లాడుతూ, ఈ క్షేత్రం అభివృద్ధికి మంత్రి పి.నారాయణ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీఓ రమణారెడ్డి, కొండాపురం తహశీల్దార్ శ్రీరాములు, సర్పంచ్ ఓరుగంటి కొండయ్యలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# యంఆర్‌ఓ ఆఫీసులో ఎమ్మెల్యే అనిల్




నెల్లూరునగర శాసనసభ్యులు డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్ గ్రీవెన్స్‌డేని పురస్కరించుకుని ఈ నెల 4న యంఆర్‌ఓ ఆఫీసులో ప్రజల నుండి అర్జీలు స్వీకరించి యంఆర్‌ఓను కలసి అర్జీదారులకు తగు న్యాయము చేయవలసినదిగా కోరారు.

ఈ సందర్భంగా డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ యంఆర్‌ఓ ఆఫీసులో ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తే ఎక్కువగా ఇళ్ళ స్థలాలకు గత 6సంవత్సరాలు క్రితం పట్టాలు ఇచ్చినా ఇంతవరకు స్థలాలు ఎక్కడున్నాయో చూపించలేదని ప్రజలు తెలియజేశారని, దీనిపై యంఆర్‌ఓను వివరణ కోరగా త్వరలోనే ఇళ్ళ స్థలాలను లబ్దిదారులకు ఇస్తామని చెప్పారని అన్నారు. అలాగే నెల్లూరు నగరం 5వ డివిజన్‌లోని బర్మాషెల్‌గుంట, అరవపాళెం ప్రాంతాలలో వున్న పేద ప్రజలకు వెంకటేశ్వరపురం, 4వ మైలు ప్రాంతాల్లో ఖాళీగా వున్న ప్రభుత్వ స్థలాలలో నివాసయోగ్యానికి అనువైనవిగా ఇళ్ళ స్థలాలను ఇవ్వాలని యంఆర్‌ఓకి చెప్పడం జరిగిందని, దీనిపై యంఆర్‌ఓ త్వరలోనే లబ్దిదారులకు ఇళ్ళ స్థలాలను ఇస్తారని చెప్పారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

వివిఎస్‌యు వి.సి రాజారామిరెడ్డి

పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని, ఇది అందరి బాధ్యత అని విఎస్‌యు ఉపకులపతి ఆచార్య జి. రాజారామిరెడ్డి అన్నారు. విఎస్‌యు ఆధ్వర్యంలో మూడురోజులపాటు జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఈ నెల 3న జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా అందరూ కృషి చేయాలన్నారు. ఈ సదస్సులో పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఆచార్య ప్రసాదరావు మాట్లాడుతూ, నీటి కాలుష్యం పట్ల అప్రమత్తంగా వుండాలని, ఈ సమస్య నివారణకు శాస్త్రవేత్తలు పరిశోధనలు చేపట్టాలని సూచించారు. ఆచార్య రంజిత్ చక్రవర్తి మాట్లాడుతూ, రేడియో ధార్మికతతో క్యాన్సర్ కారకాలు వాతావరణంలో పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.



ఆచార్య రంజిత్‌ను సత్కరిస్తున్న రాజారామిరెడ్డి

ఈ సదస్సు సందర్భంగా పదహారుమంది యువ శాస్త్రవేత్తలకు యంగ్ సైంటిస్ట్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రియాజ్‌బాషా, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిభావ సమన్వితంగా సాగిన...

# అన్నమయ్య స్వరార్చన



- మధురాతి మధురంగా సప్తగిరి సంకీర్తనలు
- వైభవోపేతంగా అన్నమాచార్య 606వ జయంత్యుత్సవాలు



పెద్దపెట్టున భక్తుల గోవింద నామస్మరణలు.. ఆనందసందోహాల మధ్య భజనలు.. కోలాటాలతో.. ఎంతో ఉత్సాహంగా.. కోలాహలంగా నగరంలో అన్నమయ్య స్వరార్చన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మధురాతి మధురమైన సప్తగిరి సంకీర్తనల గానంతో సింహపురి పులకించింది. భక్తిభావ సమన్వితంగా సాగిన ఈ అన్నమయ్య స్వరార్చనతో తిరుమలేశుని భక్తులు ఆనంద తరంగితులయ్యారు.



నెల్లూరు నగరంలో ఈనెల 2వతేదిన శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్నమాచార్య 606వ జయంత్సోత్సవాల్లో ఏర్పాటుచేసిన అన్నమయ్య సంకీర్తనల గానం ఆద్యంతం భక్తిరసస్ఫోరకంగా సాగి అందరి హృదయాలనూ ఆకట్టుకుంది. శ్రీ వేంకటేశ్వరునికి పరమభక్తుడైన తొలి తెలుగు వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులవారు ఆ తిరుమలేశుని తత్వాన్ని, మహత్యాన్నీ లోకానికి చాటుతూ, అనితరసాధ్యమైన రీతిలో 32 వేల సంకీర్తనలు వెలయించారు. తిరుమలేశునిపై అనన్య భక్తితో, 'అన్యధా శరణం నాస్తి.. త్వమేవ శరణం మమ'.. అనే శరణాగతి తత్వంతో నిత్యం శ్రీ వేంకటేశ్వరుని సేవలోనే తరించి పరవశించిపోయారు. స్వామివారికి తన సంకీర్తనా సుమాలనే పూజాకుసుమాలుగా అర్పించి.. అర్చించి తన జీవితాన్ని పునీతం చేసుకున్న ధన్యజీవి అన్నమాచార్యులవారు. అలాంటి మహనీయుని మనసారా మననం చేసుకుంటూ, ఆయన జయంతి ఉత్సవాలను స్థానిక అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ వారు ఒక వేడుకగా నిర్వహిస్తూ నెల్లూరులోనూ అన్నమయ్య ఆధ్యాత్మిక సౌరభాలను గుబాళింపజేశారు.

ఈ సందర్భంగా అన్నమయ్య సంకీర్తనలను వీనులవిందుగా గానం చేస్తూ నెల్లూరుకు చెందిన పలువురు కళాకారులు, గాయనీ గాయకులు, తమ భక్తిపారవశ్యాలను చాటుకున్నారు. వీరితోపాటు, మనుబోలు నరసయ్య బృందం వారు కోలాటాన్ని ఎంతో వేడుకగా నిర్వహించగా, చెర్లోపాళెం, రాపూరు గ్రామానికి చెందిన భక్తబృందాల వారు భజనలు చేస్తూ గోవింద నామస్మరణలతో హోరెత్తించారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లో వున్న అన్నమయ్య విగ్రహం వద్ద జరిగిన ఈ జయంత్సోత్సవ వేడుకల్లో ప్రముఖ గాయనీగాయకులు బాలార్క, గుండాల గురవయ్యలతో పాటు, లక్ష్మీ కామాక్షి, భవాని, ఇందిర తదితరులు సప్తగిరి సంకీర్తనలను అద్భుతంగా గానం చేయగా, ప్రముఖ వయోలిన్ విద్వాంసులు శేషాద్రి, మృదంగ కళాకారుడు రామకృష్ణ, తబలా కళాకారుడు శాంతి, కీబోర్డు కళాకారుడు పవన్ తదితరులు వాయిద్యసహకారం అందించారు. వీరందరినీ అభినందిస్తూ నగర డిఎస్పీ వెంకటనాథరెడ్డి వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనలు ఎన్నిసార్లు విన్నా మళ్ళీ మళ్ళీ వినాలనే వుంటుందని, ఆ సంకీర్తనలు నిత్యనూతనమని అన్నారు. ఆ తిరుమలేశుని సన్నిధిలో వున్నామా..అనే భావన కలిగేలా అత్యద్భుతంగా నెల్లూరులోనూ అన్నమయ్య స్వరార్చన నిర్వహించడం ఎంతో అభినందనీయమని ప్రశంసించారు. భక్తిభావం పెంపొందితే నేరమనస్తత్వం తగ్గిపోయి సమాజంలో ప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ ముఖ్య సమన్వయకర్త, 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పవని, వాటిని భావితరాలకు అందించాలనే సత్సంకల్పంతో తొలిసారిగా నెల్లూరు నగరంలో అన్నమయ్య స్వరార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో ఈ అన్నమయ్య స్వరార్చన కార్యక్రమాన్ని మరింత మహోన్నతంగా రూపుదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్నవారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అన్నమాచార్య ఆరాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కె.వి.సుధాకరరాజు మదిలో మెదిలిన ఆలోచనకు నిదర్శనంగా అన్నమయ్య విగ్రహం ఏర్పడి, ఈ ప్రాంతానికి 'అన్నమయ్య సర్కిల్'గా పేరొచ్చిందన్నారు. ఆయన కోరిక మేరకే తనతో సహా మరికొంతమంది పెద్దలు, పురప్రముఖులు కమిటీగా ఏర్పడి అన్నమయ్య విగ్రహాన్ని భావితరాలు గర్వపడే స్థాయిలో ఇక్కడ ఏర్పాటు చేసామని ప్రభాత్‌రెడ్డి చెప్పారు. అన్నమయ్య జయంత్యుత్సవాల సందర్భంగా తొలుత అన్నమయ్య విగ్రహానికి పుష్పమాలికలు వేసి పూజలు నిర్వహించారు. పుష్పాలంకరణతో అన్నమయ్య విగ్రహాన్ని శోభాయమానం చేశారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న నగర డిఎస్పీ వెంకటనాథరెడ్డిని మరియు విశ్వసాయి కళాశాల డైరెక్టర్ సత్యనారాయణను నిర్వాహకులు సత్కరించారు. విశ్వసాయి కళాశాల విద్యార్థులు వాలంటీర్లుగా వచ్చి, భక్తులందరికీ మంచినీళ్ళను అందించారు.

కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి కమ్మని ప్రసాదాన్ని అందించి మురళీకృష్ణ హజరత్‌బాబు, పాల్గొన్న ప్రతి భక్తుడికి (దాదాపు వెయ్యిమందికి) తిరునామాలు దిద్ది నారా నాగేశ్వరరావు భక్తుల ప్రశంసలందుకున్నారు. అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ ఉపాధ్యక్షులు వీరిశెట్టి హజరత్‌బాబు, కార్యనిర్వాహక సభ్యులు వాకాటి విజయకుమార్‌రెడ్డి, బి.వి.నరసింహం, నలుబోలు బలరామయ్యనాయుడు, కళాంజలి అనంత్, దండమూడి హేమంత్‌కుమార్, సన్నపురెడ్డి వేణుగోపాలరెడ్డి, కనుమూరు శ్రీనివాసులురెడ్డి, పి.విష్ణువర్ధన్‌రెడ్డి, గోళ్ళమూడి శ్రీధర్‌రెడ్డి, బట్రెడ్డి వెంకట కృష్ణారెడ్డి, గుమ్మడి శ్రీనివాసులురెడ్డి, కె.విజయకుమార్, వట్టిగుంట చంద్రయ్యచౌదరి, ముడి శోభన్‌కుమార్‌రెడ్డి, తామా మోహన్‌రాజ్, యస్.వి.సురేష్, వీరిశెట్టి సుధాకర్‌లతో పాటు శ్రీ త్యాగరాజ స్మరణోత్సవసభ కార్యదర్శి యనమండ్ర నాగదేవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గల్పిక

# నెల్లూరు నేతలతో నారాయణకు శిక్షణ

అది ఐఆర్ 20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధి చెందిన సింహపురి మహానగరం. రాష్ట్ర దోమలు, పందులు(పురపాలక) శాఖామంత్రి పి.నారాయణ ఆరోజు ఉదయం నుండి తిరిగి తిరిగి అప్పుడే నారాయణ ఆసుపత్రి ప్రాంగణంలోని తన ఇంటికి చేరుకున్నాడు. హాల్లో ఉన్న సోఫాలో కాళ్లు బార్లా చాపుకుని నీరసంగా కూర్చుండిపోయాడు. అంతలో అక్కడకు నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి వచ్చాడు. తన బాస్ నిరుత్సాహంగా ఉండడం గమించి ఏమైంది సార్, ఎందుకలా ఉన్నారని అడిగాడు. నారాయణ మాట్లాడుతూ... ఏంటో భాస్కరా... ఈ రాజకీయాలు బొత్తిగా అర్థం కావడం లేదు. రాజకీయ నాయకుల మాదిరిగా మనం వ్యవహరించలేకపోతున్నాం. జనాల్లో కలిసి వాళ్లు చెప్పేది వినలేకపోతున్నాం. మంత్రిగా వుండి జనాలతో మాట్లాడకపోయినా, మంత్రిగా వారి సమస్యలు పరిష్కరించలేకపోయినా మనం వుండి కూడా దండగే! ఈ రాజకీయాలు మనకు ఇప్పటికిప్పుడు వంటబట్టేవి కాదు కదా, ఏం చేయాలో పాలుపోవడం లేదు. మనం మంత్రయ్యే సరికి జనాలేమో వస్తున్నారు, వాళ్లను ఏ విధంగా సంతృప్తి పరచి పంపాలో తెలియడం లేదు. అసలు ఇంతమంది జనాలను ఈ రాజకీయనాయకులు ఎలా మెయింటెన్ చేసే వాళ్లు? అని అడిగాడు. అప్పుడు విజయభాస్కర్‌రెడ్డి... సార్, మీరు ఈ రాత్రికి పడుకుని ప్రశాంతంగా నిద్రపోండి. రేపు ఉదయానికల్లా ఈ సమస్యకు పరిష్కారం ఆలోచిస్తానని చెప్పాడు. దాంతో నారాయణ తన బెడ్‌రూంలోకి పోగా విజయభాస్కర్‌రెడ్డి మాత్రం ఆలోచనలో పడిపోయాడు.

★★★★★

తెల్లారింది. నారాయణ నిద్రలేచి రెడీ అయ్యి బయటకొచ్చాడు. అక్కడ చాలామంది కార్యకర్తలున్నారు. అంతకుముందు వాళ్లనెప్పుడూ నారాయణ చూడలేదు. నారాయణను చూడగానే వారిలో ఆవేశం పెల్లుబికింది. నారాయణ జిందాబాద్... నారాయణ వర్థిల్లాలి... అంటూ బిగ్గరగా నినాదాలు చేయసాగారు. ఒకడైతే పది షేవింగ్‌లకు వాడిన బ్లేడ్‌తో బొటనవేలు కోసుకుని తన రక్తంతో నారాయణ నుదిటిపై బొట్టుపెట్టాడు. ఆ పరిణామానికి నారాయణ బిత్తరపోయి, ఏంటి బాబు ఈ పని, రక్తం చూస్తే నాకు కళ్లు తిరుగుతాయి అన్నాడు. రక్తం కాదు సార్... మీ కోసం మా ప్రాణాలిమ్మన్నా ఇస్తాము... నారాయణ సార్ జిందాబాద్ అంటూ నినాదాలు చేయసాగాడు. నా మీద వీళ్లకు ప్రాణాలిచ్చేంత అభిమానం ఎందుకు పుట్టుకొచ్చిందబ్బా... అని నారాయణ ఆలోచిస్తూ... విజయభాస్కర్ ఏంటి ఇదంతా అని అడిగాడు. అప్పుడు విజయభాస్కర్... మీకు రాజకీయాలు అలవాటు కావడం కోసమే ఇదంతా, వీరంతా ఇక నుండి మీకు వీరాభిమానులు... ఈరోజు నుండి మీకు మూడురోజులు ట్రైనింగ్ ప్రోగ్రామ్... ఈరోజు స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి మీకు ట్రైనర్‌గా వ్యవహరిస్తారని చెప్పాడు.

ఆరోజు నెల్లూరు రూరల్ మండలం చంద్రబాబునగర్‌లో మంత్రి పర్యటన పెట్టారు. ఆయనతో పాటు వివేకా కూడా అక్కడకు వచ్చాడు. వివేకా మనిషి చాలా క్లాస్‌గా వున్నా, అక్కడ మాస్ వాతావరణంలో ఇమిడిపోయాడు. అక్కడ చెడ్డీల్లేకుండా ఆడుకుంటున్న చిన్నారులను పిలిచాడు. ఏంరా, మీకు చెడ్డీలు లేవా అని అడిగాడు. దానికి వాళ్లు... చెడ్డీలేసుకుంటే గాలి ఆడదు... ఇలాగుంటేనే హాయిగా ఉంటుందన్నారు. వివేకా వుండి... చిన్నప్పుడు నేను కూడా మీలాగే తిరిగేవాడిని, బజారులో పోయేవాళ్లు జడుసుకుంటున్నారని మా పెద్దోళ్లే నాకు బలవంతంగా చెడ్డీలు తొడిగేవాళ్లు అని చెప్పి వివేకా వారితో కొద్దిసేపు ఆడుకున్నాడు. తర్వాత అక్కడే ఎదురుపడిన ఓ ముసలావిడను కౌగిలించుకుని... ఏం సుబ్బవ్వా బాగున్నావా అని వివేకా ఆప్యాయంగా పలుకరించాడు. ఆమె కూడా బాగున్నాను నాయనా... చాలారోజులైంది కనిపించి అంది. అక్కడ నుండి ముందుకు కదిలాక నారాయణ వుండి... ఆమె పేరును ఎలా గుర్తుపెట్టుకోగలిగావు అని వివేకాను అడిగాడు. అందుకు వివేకా... ఆమె పేరు సుబ్బమ్మో, ఎల్లమ్మో మనకు తెలియదు... ఎదురుపడ్డవాళ్లను నోటికొచ్చిన పేరుతో పిలవడమే మనం చేయాల్సినపని. మనం ఏ పేరు పెట్టి పిలిచినా, అది నా పేరు కాదు అని వాళ్లు చెప్పుకోలేరు. మన పలకరింపే వారికి పులకరింపు అని చెప్పి ముందుకు కదిలాడు. అక్కడేవున్న టీబంకు వద్ద ఆగాడు. వివేకా వెంటనే స్టౌ వద్ద కెళ్లి టీ కాయసాగాడు. నారాయణ ఆశ్చర్యంగా... అదేంటి, మీకు టీ కాయడం వచ్చా అని అడిగాడు. ప్రజాప్రతినిధి అన్నాక ఇవి తప్పవు. టీ బంకుల వద్ద టీ తాగడం అనేది అందరూ చేస్తారు. కాని స్వయంగా టీ కాయడం అనేది నాలాంటి వాళ్లే చేస్తారు. ఇలాంటివి నువ్వు కూడా అలవాటు చేసుకో, మంత్రి నారాయణ టీ కాసాడని పేపర్లో వస్తే ఆ ఆనందమే వేరు అని చెప్పాడు. ఆ తర్వాత నారాయణను మాంసం కొట్లోకి తీసుకెళ్లి మటన్ కైమా కొట్టించాడు. చేపల మార్కెట్‌లోకి తీసుకెళ్లి చేపలు తోమించాడు. ఇస్త్రీ బండి వద్ద ఆపి బట్టలు ఇస్త్రీ చేయించాడు. టిఫిన్ అంగట్లో దూరి బోండాలు, దోశెలు కాల్పించాడు. ఆ ఒక్కరోజులో ఎన్ని మాస్ పనులున్నాయో వివేకా అన్ని పనులను కూడా నారాయణతో చేయించాడు. ఆరోజు ప్రోగ్రామ్‌లు పూర్తి చేసుకుని నారాయణ ఇంటికి చేరుకున్నాడు. ఆయనకు ఆరోజు ప్రోగ్రామ్ అంతా ఎంతో ఆనందంగా గడిచింది. నారాయణకు ఈ పనులన్నీ చేయడం వెరైటీగాను ఉత్సాహంగానూ వుంది.

★★★★★

రెండోరోజు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ద్వారా నారాయణకు ట్రైనింగ్. కార్యకర్తలు పనులమీద వస్తే నాయకుడు ఎలా చేయాలనేది పాయింట్. ఒక కార్యకర్త వచ్చాడు. సార్, నాకు ఎస్‌బిఐ మేనేజర్ లోన్ ఇవ్వడం లేదని సోమిరెడ్డికి చెప్పాడు. వెంటనే సోమిరెడ్డి ఆ బ్యాంకు మేనేజర్‌కు ఫోన్ చేసి... ఏమయ్యా, మావాడికి లోన్ ఇవ్వవన్నావంట... ఎగ్గొట్టిపోయ్యేవాళ్లకు లోన్‌లు ఇస్తారా మీరు? అని ప్రశ్నించాడు. ఆ మేనేజర్... సార్, అతని రిటర్న్లు బాగా లేవు, పైగా ష్యూరిటీ లేదు. ఏ వ్యాపారం చేసి తిరిగి బాకీ కడతాడో చెప్పడం లేదు... లోన్ ఎలా ఇవ్వమంటార్సార్ అని చెప్పాడు. మీరు ఇవన్నీ చూసి లోన్‌లు ఇచ్చిన వాళ్లు కరెక్ట్‌గా కడుతున్నారా? ముందు లోన్ ఇవ్వండి, టైం బాగుంటే వాడే కడతాడు అని చెప్పి పెట్టేసాడు. అంతలో ఇంకొక వ్యక్తి వచ్చి... సార్, మా పక్క పొలం వ్యక్తితో తగాదా వచ్చింది. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టాడు. ఎస్సైకి కొంచెం చెప్పండి సార్ అని అడిగాడు. వెంటనే సోమిరెడ్డి ఎస్‌ఐకు ఫోన్ చేసాడు. ఫలానా వ్యక్తి మీ వద్దకొస్తాడు. అతనికి న్యాయం చేయండి అని చెప్పాడు. సోమిరెడ్డి ఫోన్ పెట్టేసాక ఆ వ్యక్తి వెళ్లి పోయాడు. వెంటనే సోమిరెడ్డి మళ్లీ రూరల్ ఎస్‌ఐకి ఫోన్ చేసి... ఇంతకుముందు నేను ఫోన్‌చేసి చెప్పాను కదమ్మా... ఇద్దరూ మనకు కావాల్సినవాళ్లే... రాజీ చేసి పంపించు అని చెప్పి పెట్టేసాడు. అప్పటిదాకా జరిగిందంతా చూస్తున్న నారాయణకు అదేం అర్థం కాలేదు. అదేంటి చంద్రన్నా, బ్యాంకు పని మీద వచ్చిన వాడికేమో డైరెక్ట్‌గా చెప్పేసారు. ఎస్‌ఐ పని మీద వచ్చిన వాడికేమో రెండు విధాలుగా చెప్పారని అడిగాడు. అందుకు సోమిరెడ్డి... బ్యాంకు విషయంలో మనకు మొహమాటం లేదు. బ్యాంకు వాళ్లేమో మన ఓటర్లు కాదు, కాని పోలీసు కేసు వద్దకొచ్చేసరికి ఇద్దరూ మనవాళ్లే... మనం ఇద్దరికీ న్యాయం చేసినట్లుగా వుండాలి. పదవుల్లో వున్న వాళ్లు పాటించాల్సిన ముఖ్యసూత్రం ఇది అని చెప్పాడు.

★★★★★

మూడోరోజు శిక్షణ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో. దొంతాలిలో పర్యటన. మంత్రి నారాయణ, పక్కన కోటంరెడ్డి... పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ జరిగింది. తర్వాత కోటంరెడ్డి ప్రసంగిస్తూ... నేను కోటీశ్వరుడిని కాదు, మీలాంటి సామాన్యుడినే, సామాన్య కుటుంబం నుండే, సామాన్యుడి సత్తా ప్రపంచానికి చాటుదాం అంటూ తన ప్రసంగంలో 'సామాన్యుడు' అనే పదాన్ని దాదాపు వందసార్లకు పైగా వాడాడు. అదేపదాన్ని కోటంరెడ్డి అన్నిసార్లు ఎందుకు వాడాడో నారాయణకు అర్థం కాలేదు. దొంతాలిలో కార్యక్రమం ముగిసాక ఒకే కారులో ఇద్దరూ నెల్లూరుకు బయల్దేరారు. దారిలో నారాయణ వుండి... శ్రీధరా, సామాన్యుడు అనే పదాన్ని అన్నిసార్లు ఎందుకు వాడావని అడిగాడు. అప్పుడు శ్రీధర్‌రెడ్డి... సార్ ఈ దేశంలో ప్రతి వందమందిలో 70మంది హిందువులు, 15మంది ముస్లింలు 10మంది క్రైస్తవులు, ఇంకో 5మంది ఇతర మతాల వాళ్లు వుంటారు. అలాగే వందమంది హిందువుల్లో రెడ్లు, కమ్మ, కాపు, యాదవ, ఎస్సీ, ఎస్టీ... ఇలా రకరకాలు. ఇవన్నీ తీసి పక్కనపెడితే దేశంలోని ప్రతి వందమందిలో 90మంది సామాన్యులే.. కులమతాలకు అతీతంగా ఈ 90మందిపై సామాన్యుడు అనే ముద్రవేసి వారిని మన లైన్‌లోకి లాక్కోవడానికే ఆ పదాన్ని ఎక్కువుగా ఉపయోగిస్తుంటానని చెప్పాడు. దాంతో నారాయణ... చదువుల్లో కొచ్చే సరికి నేను మీకు గురువును... రాజకీయాల్లో మాత్రం మీరంతా నాకు గురువులయ్యారంటూ... ఆరోజు పర్యటనను ముగించుకుని ఇంటికి బయల్దేరాడు.

★★★★★

కదంబం

## యుద్ధవేదిక

- ఏటూరి నాగేంద్రరావు,
నెల్లూరు. 7416665323

రాత్రింబవళ్ళు విద్యుత్‌దీపాల మధ్య
వినోదప్రదర్శనార్థం
కత్తుల బోనులో కసరత్తులు చేస్తూ
బెత్తెడులో తప్పిన విపత్తును చవిచూస్తూ
కర్కశమైన సర్కస్ డేరా కింద
కాలాన్ని గడిపేస్తుంటావు నువ్వు
అడుగున కట్టిన వెడల్పయిన వల
అదే నీ జీవితానికి వజ్రకవచం
అక్కడ జనించే జనుల కరతాళధ్వనులు
అవే నీ బ్రతుకు పాలిట బంగారు గనులు

సాముగరిడీల నీ సాహసయుద్ధానికి
సాక్షీభూతులై
నీ అంగాంగ సౌందర్యాన్ని
కోరికలు నిండిన కళ్ళతో కొల్లగొట్టే జనం
యమగండాన్ని కమనీయంగా
మీటుకొంటూ
యాతనల్ని అలవోగ్గా దాటుకుంటూ
తేలిపోయే నీ దుర్భర జీవితాన్ని
చూడలేదు
నువ్వు పఠించేది ప్రమాదాల వేదాన్ని!
అందరికీ అందించేది ఆకృతిలేని
వినోదాన్ని!
కడుపునిండే అవసరమే నీకు ప్రాతిపదిక
కరాళమైన సర్కస్ డేరా
ఖచ్చితంగా నీకు యుద్ధవేదిక!!!

పెన్నా సాహిత్య పురస్కారం కోసం

## కవితా సంపుటులకు ఆహ్వానం

ప్రతి ఏటా మంచి కవిత్వానికి పెద్దపీట వేస్తూ పెన్నా సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న పెన్నా రచయితల సంఘం ఈ సంవత్సరం పురస్కారానికి జనవరి 2013 నుంచి ఇప్పటివరకు ప్రచురితమైన కవితాసంపుటులను ఆహ్వానిస్తోంది. 4కాపీలు ఆగష్టు 31వ తేదీలోగా గుండాల నరేంద్రబాబు, వ్యవస్థాపక అధ్యక్షులు, డోర్.నెం.25-1-890, 4వ వీధి, నేతాజీనగర్, ఏ.కె.నగర్‌పోస్టు, నెల్లూరు-4 చిరునామాకు పంపమని పెరసం వ్యవస్థాపక కార్యదర్శి మోపూరు పెంచలనరసింహం కోరుతున్నారు. వివరాలకు 9493235992లో సంప్రదించగలరు.

## వైభవంగా కుంకుమార్చనలు

నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో వున్న శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కొలువైవున్న శ్రీ విజయదుర్గ అమ్మవారికి భక్తులు ఈనెల 5న వైభవంగా లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. జేసిస్ మహిళావిభాగం ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. అమ్మవారి అలంకారోత్సవానికి పి. బాలకృష్ణ, లక్ష్మీదేవి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా చీతిరాల వెంకటేశ్వర్లు-లక్ష్మీసౌజన్య దంపతులు 108 మంది మహిళలకు జాకెట్లు, పసుపుకుంకుమలు అందజేశారు. ఆలయ ఛైర్మెన్ మునగా వెంకటేశ్వర్లు, కార్యదర్శి మంచికంటి శ్రీనివాసులు తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు వేడుకగా జరిగాయి.

## వైభవంగా ప్రత్యంగిరా హోమం

నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేటలో బ్రహ్మశ్రీ మాచవోలు రాజశేఖరశాస్త్రి నివాసంలో నిర్వహిస్తున్న చాతుర్మాస దీక్షా మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 5న వైభవంగా ప్రత్యంగిరా హోమం నిర్వహించారు. విశాఖపట్నంలోని శ్రీ సౌభాగ్య భువనేశ్వరి పీఠాధిపతి శ్రీ రామానందభారతీస్వామివారు పాల్గొని ప్రత్యంగిరా హెూమం విశిష్టతను తెలిపారు. సకల జనులు సుఖ శాంతులతో జీవించేందుకు, ప్రజల మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా, ఎవరికీ శత్రుభయం లేకుండా వుండేందుకు లోకకళ్యాణార్థం ఈ హెూమం నిర్వహిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో రాజశేఖరశాస్త్రితో పాటు, మాచవోలు రమేష్‌శర్మ, ఎనమండ్ర నాగదేవిప్రసాద్, చిలకపాటి శ్రీరామమూర్తి, మాచవోలు శివరామశర్మ, రామకృష్ణ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు పూజలు

నెల్లూరు నగర శివారు ప్రాంతమైన కొత్తూరు పరిధిలోని చంద్రబాబునగర్ బి-బ్లాక్‌లో వున్న పోలేరమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 5న తమిళ భక్తులు ఆడిమాసం పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో అంబలిపోసి, పొంగళ్లు పెట్టి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు.

**మేషం**



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

వృత్తిపరంగా బాగా ప్రాబల్యం ఉండి ఆదాయం బాగుంటుంది. వ్యాపారవర్గాలకు ఆర్థికస్థితి అభివృద్ధి కరం. ఆదాయం బాగుంటుంది. అయితే అదనపు ఖర్చులు ఎక్కువగా ఉండినా డబ్బు సర్దుబాటు అవుతుంది. శుభ కార్యాలలో పాల్గొనడం, దూరప్రయాణాలుండటం, బంధు వర్గంతో సఖ్యత బాగుంటుంది. గృహ వసతులు ఏర్పరచుకొని కొనుగోలు చేస్తారు.

**కన్య**



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

పనులు అనుకొన్నవి సరిగా జరుగక టెన్షన్ కలిగి స్తాయి. వ్యాపారవర్గాలకు ఆదాయం పెరిగి అభివృద్ధి బాగుంటుంది. కుటుంబసమస్యలు ఉద్యోగ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకొనండి. బిడ్డల ఉద్యోగ, విద్యావిషయాలపై శ్రద్ధ చూపుతారు. శుభకార్యాల ఖర్చులు పెరగడం, తప్పనిసరి ప్రయాణాలుంటాయి. స్థిరాస్తుల క్రయవిక్రయాలు అనుకూలిస్తాయి.

**వృశ్చికం**



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

నూతన వ్యాపారాలు, ఉపాధులలో స్థిరపడతారు. వృత్తి జీవనంలో వ్యాపకం ప్రాబల్యం పెరుగుతుంది. వ్యాపారదారులకు అభివృద్ధి, ఆదాయం బాగుంటుంది. అనవసర ఖర్చులు పైబడినా సర్దుకుంటారు. అల్లుళ్లతో తగాదాలు రావచ్చును. మిమ్మల్ని వ్యతిరేకించిన వారే సన్నిహితం అవుతారు. షేర్లు స్టాక్ మార్కెట్లు లాభాల దిశగా సాగుతాయి.

**వృషభం**



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్శ1, 2పాదాలు

ఈ వారం ఖర్చులు బాగా పెరుగుతాయి. అయినా డబ్బు సర్దుబాటు అవుతుంది. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది. నిర్మాణాలు జరిపేవారు, పరిశ్రమల యాజమాన్యాల వారికి క్రింది ఉద్యోగులతో, వర్కర్లతో ఇబ్బందులుం టాయి. దూరప్రాంతాలకు ప్రయాణాలుంటాయి. స్థిరాస్తుల లావాదేవీలు జరుగుతాయి.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 08.8.2014 నుండి
తేది. 14.8.2014 వరకు

ఈవారం కర్కాటకరాశిలో రవిబుధగురుశుక్రులు, 15తేది నుండి సింహబుధుడు, కన్యలో రాహువు, తులలో శనికుజులు, మీనంలో కేతువు, ధనుర్మకరకుంభమీన రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగము: తేది 8 శుక్రవారము వరలక్ష్మీవ్రతము
తేది 10 ఆదివారము శ్రావణపూర్ణిమ, రాఖీపండుగ.

ముహూర్తములు: తేది 13 బుధవారము రాత్రి గం॥1.42నుండి 3.50గం॥లోగా వివాహ గృహప్రవేశాలకు మిథునలగ్నము

తేది 14 గురువారము రాత్రి గం॥1.36 నుండి గం॥3.44లోగా వివాహ గృహప్రవేశములు మిథునలగ్నము

**శ్రావణమాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 08 | శుక్ర | ద్వాదశి | ఉ॥గం.7.28వ॥ |
| | పిదప | త్రయోదశి | రా॥గం.5.25వ॥ |
| తేది. 09 | శని | చతుర్దశి | రా॥గం.3.04వ॥ |
| తేది. 10 | ఆది | పూర్ణిమ | రా॥గం.12.38వ॥ |

**శ్రావణమాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 11 | సోమ | పాడ్యమి | రా॥గం.10.10వ॥ |
| తేది. 12 | మంగళ | విదియ | రా॥గం.7.40వ॥ |
| తేది. 13 | బుధ | తదియ | సా॥గం.5.24వ॥ |
| తేది. 14 | గురు | చతుర్థి | సా॥గం.3.40వ॥ |

**ధనుస్సు**



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి వ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. కొత్త పథకాలు, ప్రోత్సాహకాలతో ముందుకు సాగి ఆర్థికస్థితిని మెరుగుపరచుకొంటారు. ఖర్చులు మాత్రం విపరీతంగానే ఉంటాయి. బంధువర్గంతో విభేదాలు రాగలవు. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం జరుగుతుంది. ఉన్నత విద్యావ కాశాలు లభించగలవు. ఉద్యోగులపై అధికారుల వత్తిడి బాగుంటుంది. గృహ, వస్తు, వాహన రిపేర్లు జరుగుతాయి.

**మిథునం**



మృగశిర్శ 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థిక వ్యవహారాలను, వృత్తి వ్యాపారాలను సమర్థ వంతంగా నడుపుతారు. ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులకు పనివత్తిడి ఉండినా సామర్థ్యం బాగుం టుంది. అనుకున్న పనులను పట్టుదల శ్రమతో సాధించు తారు. నూతన వస్తు వస్త్రాభరణాలు సమకూరడం, కుటుంబసౌఖ్యం బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీ లందు సలహా సంప్రదింపులు జరిపి నిర్ణయించండి.

**మకరం**



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వ్యవహారపరమైన, వృత్తిపరమైన, కుటుంబపరమైన సమస్యలను అధిగమిస్తారు. వృత్తి, వ్యాపారాలలో మంచి అభివృద్ధి అవకాశాలుంటాయి. మీటింగులలో, సమావేశ నిర్ణయాలలో ప్రముఖ పాత్ర వహిస్తారు. గృహనిర్మాణాలు, బ్యాంకు రుణాలకు అడ్డంకులు తొలుగుతాయి. ఉద్యోగులు సమర్థత ప్రదర్శించి అధికారులకు సన్నిహి తులుకాగలరు. చిరు అధికారం లభించగలదు.

**కర్కాటకం**



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుంటుంది. ఆదాయం బాగుండినా అనవసర ఖర్చులు పెరుగుతాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. ఆశించిన అవకా శాలు చేజారిపోవచ్చును. మీ పనులు, ప్రవర్తనపై విమర్శ లుంటాయి. చిరువ్యాపారవర్గాలకు రాబడి బాగుంటుంది. కాంట్రాక్టర్లకు, స్టాకిస్టులకు స్వల్ప ఇబ్బందులుంటాయి. కొత్త గృహోపకరణములు వస్తువులు కొంటారు.

**కుంభం**



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వ్యాపారాలలో ఆటంకాలను పోటీలను అధిగమిం చడానికి కష్టపడతారు. వృత్తి వ్యాపారాలలో ఆశించిన ఆదాయం లభించదు. పైగా శుభకార్య ఖర్చులు, ప్రయాణ ఖర్చులు కొనుగోలు పెరుగుతుంది. ప్రభుత్వ అనుమతులు ఆలస్యంకాగలవు. ఆరోగ్యం సరిగా ఉండదు. గాయాలు తగలవచ్చును. భాగస్వామిక చర్చలు, వాణిజ్యఒప్పందాలు పరిష్కారానికి వస్తాయి.

**సింహం**



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆదాయ వ్యయాలు అంచనాలకు భిన్నంగా సాగుతాయి. మంచి వ్యాపార అవకాశాలు పోగొట్టుకొంటారు. కుటుంబంలో వ్యక్తికి అనారోగ్య బాధలుంటాయి. ముఖ్య మైన పనులు వాయిదాపడగలవు. వృత్తిపరంగా బాగుం టుంది. వస్తు వాహన రిపేర్లుంటాయి. దూరప్రయాణాలు శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. ఉద్యోగులకు పనివత్తిడి, అధికారులతో ప్రయాణాలుంటాయి.

**తుల**



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అనుకున్న సొంత పనులను, అధికారిక పనులను సమర్థవంతంగా నిర్వహిస్తారు. వృత్తి జీవనాధారంగల వారికి, వ్యాపారవర్గాలకు ఆదాయం పెరుగుతుంది. మార్కెటింగ్ వర్గాల వారికి, రియల్ ఎస్టేట్ రంగాల వారికి వ్యాపకం బాగుంటుంది. నోటీసులు, బిల్లులు అందుకుంటారు. ఆర్థిక ఒప్పందాలలో జాగ్రత్త వహిం చండి. ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు.

**మీనం**



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వ్యవహారాలలో ఒప్పందాలలో జాగ్రత్తపడి పరిస్థితుల బట్టి సర్దుకొనిపోవడం మంచి. బుధ,గురువారాలలో బంధువులు సన్నిహితులతో విభేదాలు రావచ్చును. వృత్తిపరంగా వ్యాపకం బాగుంటుంది. ఆర్థికముగా కొద్దిపాటి సమస్యలుంటాయి. వ్యాపారవర్గాలకు స్వల్ప అభివృద్ధి, ఆదాయముంటుంది. అదనపు ఖర్చులుండినా సర్దుబాటు చేసుకొంటారు.

# నరేంద్రరెడ్డి సేవలు అపారం


## ఏపిజిబి ఉద్యోగుల సంఘం నాయకుల ప్రశంస

జిల్లాలో ఏపిజిబి ఉద్యోగుల సంక్షేమానికి ఆ ఉద్యోగుల సంఘం నాయకుడైన నరేంద్రరెడ్డి అందించిన సేవలు అపారమైనవని అఖిలభారత ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్ అధికారుల సమాఖ్య అధ్యక్షులు, ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటేశ్వరరెడ్డి కొనియాడారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో మేనేజర్‌గా పనిచేస్తూ ఇటీవల పదవీ విరమణ చేసిన నరేంద్రరెడ్డిని ఆ సంఘం తరపున అధికారులు, ఉద్యోగులు ఈ నెల 3న స్థానిక భవాని రెసిడెన్సీలో ఘనంగా సత్కరించారు. నరేంద్రరెడ్డి సేవలను అందరూ ప్రస్తుతించారు. ఈ కార్యక్రమానికి బ్యాంక్ అధికారుల సంఘం అధ్యక్షులు సుబ్బారావు అధ్యక్షత వహించారు. అనంతరం నరేంద్రరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో పలు బ్యాంక్ ఉద్యోగుల సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. సంఘ నాయకులు బి.వెంకటేశ్వర్లు, కె.నరసింహులు, సి.ప్రభాకరరెడ్డి, కె. శ్రీనివాసరావు, ఏపిజిబి నెల్లూరు, ప్రకాశం జిల్లాల రీజనల్‌మేనేజర్‌లు మస్తానయ్య, విసికె ప్రసాద్, యుఎఫ్‌బియు జిల్లా సమన్వయకర్త ఎన్‌వివిఎస్ ప్రసాద్, శ్రీహరిరెడ్డి, ఎన్‌ఆర్ ప్రసాద్ తదితరులతో పాటు అనేకమంది అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# రక్తదాన ఆవశ్యకత - అవగాహన సదస్సు

ఈ నెల 2వ తేదీన రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్, లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు - పినాకిని మరియు విక్రమసింహపురి విశ్వ విద్యాలయం ఎన్.ఎస్.ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో విక్రమసింహపురి విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మురుగయ్య అధ్య క్షతన రక్తదాన ఆవశ్యకత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ డా॥ఈదూరు సుధాకర్ మాట్లాడుతూ అన్ని దానాలలో కన్నా రక్తదానం మిన్న అని, రక్తదానమే ప్రాణదానమని, దాతలే దేవుళ్ళన్నారు. 50కె.జి.లు బరువున్న మనిషిలో 5లీటర్లు (5,000 మిల్లీ లీటర్లు) రక్తం ఉంటుందని, రక్తదానం ద్వారా కేవలం 350మిల్లీ లీటర్లు మాత్రమే సేకరిస్తారని, ఈ రక్తం మరియు రక్తభాగాల (కాంపోనెంట్స్) ద్వారా ఒక రక్తదాత ముగ్గురి ప్రాణాలు రక్షిస్తాడని, రక్తదానం చేయడం వలన దాత ఆరోగ్యవంతుడవు తాడని, రక్తస్వీకర్త దీవెనలతో నూరేళ్ళు రక్తదాతగా జీవి స్తాడని, 18సంవత్సరాల నుండి 58సంవత్సరాల వరకు సంవత్సరానికి 4సార్లు (ప్రతి మూడు నెలలకు ఒకసారి) రక్తదానం చేయడం ద్వారా జీవితంలో 120సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. ఈ కార్య క్రమంలో విక్రమ సింహపురి విశ్వవిద్యా లయం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మురుగయ్య, ఎన్.ఎస్.ఎస్.కోఆర్డినేటర్ సునీత, లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు పినాకిని అధ్యక్షులు శరత్,




రెడ్‌క్రాస్ రక్తనిధి మోటివేటర్ బొట్టా భాస్కర్‌రావు పాల్గొన్నారు.

# తపాలా ఉద్యోగుల పిల్లలకు ప్రోత్సాహం

నెల్లూరు ఆచారివీధిలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఈనెల 3న తంతి, తపాలా ఉద్యోగుల సహకార పరపతి సంఘం 55వ సర్వసభ్య సమావేశం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షులు కె.సుధాకర్ సమావేశానికి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా జిల్లా పోస్టాఫీసుల సూపరింటెండెంట్ పి.విశ్వనాథం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యుల పిల్లలలో 2013-14 విద్యాసంవత్సరంలో పదోతరగతి, ఇంటర్మీడియట్, ఇంజనీరింగ్, మెడిసిన్ చదువుతూ ప్రతిభ చూపిన పదిహేను మందిని సత్కరించి ప్రోత్సాహకాలను అందించారు. సహకార పరపతి సంఘానికి వచ్చిన 12శాతం డివిడెండ్‌ను ఉద్యోగులకు పాలకవర్గం తీర్మానించింది.

అలాగే 2013 మార్చి 31 నాటికి సంఘంలో సభ్యులై వున్న వారికి బహుమతులు ఇవ్వాలని నిర్ణయించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి బి.వి.ఎన్.సురేష్, ఉపాధ్యక్షులు జి.సుధాకర్‌రెడ్డి, కోశాధికారి బెనర్జీ, డైరెక్టరు ఏ.వి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. తదుపరి జిల్లా ప్రధాన తపాలా కార్యాలయం, ప్రక్కనే వున్న తంతి కార్యాలయంలో ఉద్యోగులకు డివిడెండ్, బహుమతులు పంపిణీ చేసారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దాదాపు మూడువేల మంది తంతి, తపాలా ఉద్యోగ సిబ్బందితో కార్యాలయాలు క్రిక్కిరిసాయి.

# చిన్నారులకు పుస్తకాలు పంపిణీ



నెల్లూరుజిల్లా ముస్లిం సేవా కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ గాయకులు మహ్మద్ రఫీ వర్ధంతి సంద ర్భంగా ఈ నెల 5న కోట మిట్ట షాదీమంజిల్‌లోని పాఠశాల విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, పలకలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 43వ డివిజన్ కార్పొరేటర్ ఎమ్.డి.ఖలీల్ మాట్లాడుతూ మహ్మద్ రఫీ గొప్ప గాయకులని, ఆణిముత్యాలైన సినీగీతాలతో పాటు ఎన్నో భక్తి గీతాలను కూడా ఆలపించి అందరి మన్ననలను పొందారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో స్వర్ణ ప్యాలెస్ అధినేత ముల్లంగి రాధాకృష్ణయ్య, జిల్లా ముస్లిం యూత్ అధ్యక్షులు ఎస్.కె.ఖలీద్, మున్నా, ఇస్సాక్, ఉపాధ్యక్షుడు అల్తాఫ్, మున్వర్, మైను, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వభారతి అంధుల పాఠశాలలో

# అన్నదానం

నగరంలోని విశ్వభారతి అంధుల పాఠశాలలోని అంధ విద్యార్థులకు ఆది వారం మధ్యాహ్నం గుమ్మినేని ప్రభాకర్ (రంగనాయకస్వామి దేవస్థానం రిటైర్డ్ ఎగ్జి క్యూటివ్ ఆఫీసర్) దంపతుల సౌజన్యంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మురళీ ఆర్ట్స్ అధినేత, టి.వి.ఆర్టిస్ట్ శింగంశెట్టి మురళీమోహన్‌రావు మాట్లా డుతూ ప్రభాకర్ దంపతులు అంధ విద్యార్థు లకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిం చడం ఎంతో అభినందనీయమని, వీరు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని అన్నారు.

ఈ కార్యక్రమంలో టి.వి. ఆర్టిస్ట్ శింగంశెట్టి మురళీమోహన్‌రావు, గుమ్మినేని ప్రభాకర్, గుమ్మినేని దేవి, బి.వి.నర సింహం, గౌరీశంకర్ మరియు పాఠశాల నిర్వాహకులు రోశమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వాకర్స్‌కు ఉచిత వైద్యపరీక్షలు



నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల 250 మంది వాకర్స్ సభ్యులకు ఉచితంగా బి.పి., షుగర్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సహకారంతో నోడల్ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి రక్తపరీక్షలకు కావాల్సిన సామాగ్రిని ఉచితంగా అందజేశారు. వైద్యులు సత్యనాథ్, అంకిరెడ్డి, ఎం.ఎస్. రెడ్డి, శ్రీనివాసకుమార్, దొరస్వామినాయుడు, పి.నాగేశ్వరరావులు వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పూండ్ల దయాకర్‌రెడ్డి, కార్యదర్శి బి.శేషగిరిరావు, ఉపాధ్యక్షులు డి.రమణయ్య, వి.రంగారావు, కె.విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మద్యం షాపులతో మహిళలకు ఇక్కట్లు

## నివారించాలంటూ ఎస్పీకి అరుణమ్మ వినతి



నగరంలోని పలు ప్రాంతాల్లో వేళాపాళా లేకుండా నడుపుతున్న మద్యం షాపులతో మహిళలు అనేక అవస్తలు పడుతున్నారని, నిబంధనలు పట్టించుకోకుండా నడుపుతున్న ఈ షాపుల పనితీరును పరిశీలించి, వాటి వల్ల మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా ఎస్పీకి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి పందిళ్ళపల్లి అరుణమ్మ ఇటీవల వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా నగరంలోని ఆత్మకూరు బస్టాండ్, శెట్టిగుంటరోడ్డు, తడికలబజారు, పొదలకూరురోడ్డు తదితర ప్రాంతాల్లో వున్న పలు మద్యంషాపులు పగలు రాత్రి అనే తేడా లేకుండా ఇరవైనాలుగ్గంటలూ బార్లుగా మారిపోయాయని, ఆయా ప్రాంతాల్లో వాటివల్ల మహిళలు తిరగడానికే భయపడుతున్నారని ఆమె పేర్కొన్నారు. మద్యం బెల్ట్‌షాపుల నిర్మూలన అంతంతమాత్రంగానే వుందని, చాటుమాటుగా మద్యం అమ్మకాలు జోరుగా సాగిపోతూనేవున్నాయని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా, జిల్లాలో శాంతి భద్రతలను పరిరక్షించాలని, ట్రాఫిక్ సమస్యను నివారించాలని ఆమె కోరారు. ఆటోల్లో ప్రయాణం మహిళలకు భద్రతగా వుండడం లేదని, కాలేజీలు, విద్యాలయాల వద్ద అల్లరిమూకల ఈవ్‌టీజింగ్‌ను నియంత్రించాలని ఆమె కోరారు. ఆత్మకూరు బస్టాండ్, ఆర్టీసీబస్టాండ్, ములుముడి బస్టాండ్‌ల ప్రాంతాల్లో మందుబాబులు, జులాయిమూకల సంచారం ఎక్కువైందని, మహిళలకు భద్రత వుండడం లేదని ఆమె పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ వీటన్నిటిపై దృష్టి సారించి మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వుండేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

# రాష్ట్రస్థాయి షటిల్‌కు నితిన్‌వత్సల్

స్థానిక వేదవ్యాస స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న పి.నితిన్‌వత్సల్ రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బాలాజీ తెలియజేశారు. కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగే అండర్-3 షటిల్ పోటీల్లో నితిన్ పాల్గొంటాడని ఆయన పేర్కొన్నారు.






# తీరు మారేనా? కేడర్ నిలిచేనా?

(మొదటిపేజీ తరువాయి)

కేసుల విచారణ వేగవంతం చేసి, వైకాపా కేడర్‌ను చెల్లాచెదురు చేయాలనుకుంటున్నాడు. రాష్ట్ర విభజన తర్వాత 13జిల్లాల ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశంపార్టీకి కుల సమీకరణలు కలిసొచ్చాయి. కమ్మ, కాపు కాంబినేషన్‌తో ఈ రాష్ట్రాన్ని గుప్పిట్లో ఉంచుకోవాలనుకుంటున్నాడు. జగన్ చేజేతులా చేసుకున్న పొరపాట్ల వల్లే చంద్రబాబు ఈరోజు సీఎం సీట్లో ఉన్నాడు. ఈసారి జగన్ ఆ పొరపాట్లను సరిదిద్దుకునే అవకాశముంది. ఈ ఐదేళ్లలోనే జగన్ గట్టిగా నిలబడితే చంద్రబాబుకు మళ్ళీ రాజకీయ గండమే. అందుకే వైకాపా అనే పార్టీనే లేకుండా చేస్తే జగన్‌తో సమస్య రాదని చంద్రబాబు ప్లాన్. ఈ ఆలోచనతోనే వైకాపా ప్రజాప్రతినిధులను భారీగా తన పార్టీలోకి లాగేస్తున్నాడు.

ఈ సుదీర్ఘ సమయంలోనే జగన్ గట్టిగా నిలబడాలి. కేడర్‌ను కాపాడుకోవాలి. తన లీడర్‌షిప్‌ను చాటుకోవాలి. తనపై ప్రచారంలో వున్న అపోహలను తొలగించే ప్రయత్నం చేయాలి. ప్రజలతో మమేకమవుతున్నట్లే పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకుపోవాలి. పార్టీ కోసం మేధావులు, అనుభవజ్ఞులతో కమిటీలు వేయాలి. యువతను మహిళలను పార్టీలో ప్రోత్సహించాలి. దేశవిదేశాలలో వున్న పార్టీ సానుభూతిపరులను సమీకరించాలి. వారి వద్ద నుండి అన్ని రూపాలలో సహకారం పొందాలి. మొన్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కోసం చంద్రబాబు ఒక్కడే పనిచేయలేదు. కుల పరంగా గాని, ఇతరత్రా కారణాలతో లక్షలాది మంది సొంత డబ్బులు ఖర్చు చేసుకుని పని చేసారు. ఇంతమంది పనిచేయబట్టే తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. కాని వైకాపాలో చూస్తే జగన్, విజయమ్మ, షర్మిలలు తప్పితే ఎవరికీ ఇతర బాధ్యతలు అప్పగించలేదు. ముఖ్యనేతలు, మేధావులు, అనుభవజ్ఞులకు తలా ఒక బాధ్యత అప్పగించివుంటే ఫలితం ఇంకోరకంగా ఉండేది.

రాబోయే ఐదేళ్లు వైకాపా మనుగడకు పరీక్షే! ఇప్పుడు స్థానిక నాయకత్వాన్ని, కేడర్‌ను బలోపేతం చేసుకోవాలి. తన నాయకత్వంపై నమ్మకం కలిగేలా జగన్ వ్యవహరించాలి. తాను గాజుమేడలో కూర్చుని బయట కాపలాదారులని పెట్టే విధానానికి స్వస్తి పలకాలి. తన నాన్న లాగే తాను కూడా సామాన్యుడు సైతం తనను నేరుగా కలవగలిగేలా చూసుకోవాలి. మా సారు ఫోన్లో మాట్లాడరు, నేరుగా వచ్చి కలవండి అని చెప్పి 'జగన్' దృష్టికి వాస్తవాలు వెళ్ళనీయకుండా కట్టడి చేస్తున్న సెక్రటరీల విధానానికి స్వస్తి పలకాలి. అందరూ నేరుగా కలిసి అన్నీ చెప్పలేరు. ఒకవేళ నేరుగా కలిసినా జగన్‌తో వ్యక్తిగత ఇంటర్వ్యూ దొరకడం కల్ల అనే నానుడి ఇప్పటికీ రాష్ట్రమంతా వినపడుతోంది. ఈ పద్ధతులన్నింటికీ స్వస్తి చెప్పాలి. నిజమైన అభిమానులెవరో, అసలైన ఆత్మీయులెవరో తెలుసుకోవాలి. వై.యస్.రాజశేఖరరెడ్డిని గుండెల్లో పెట్టుకుని, ఆయన ఫోటోలను పూజగదుల్లో పెట్టుకుని ఆయన విగ్రహాలను తమ ప్రాంగణాల్లో పెట్టుకున్న వ్యక్తులకు సైతం నేరుగా కలిసే అవకాశం లేకపోగా వారిపై వ్యతిరేక ముద్ర వేసే విధంగా చెప్పుడు మాటలను చెప్పేవాళ్ళను జగన్ ప్రక్కనే త్రిప్పుకోకుండా ప్రక్కన పెట్టాలి.

వాస్తవాలు చేదుగా వుంటాయి కాని అవి తెలుసుకుని సరిదిద్దుకున్నప్పుడే ఫలితాలు కమ్మగా వస్తాయి. ఇకనైనా పార్టీ నుండి వలసలకు అడ్డుకట్టవేసే దిశగా వ్యవహరిస్తూ పార్టీని నమ్ముకుని ఉన్న వారికి ధైర్యం కల్పించాలి.

# అధికారం కోసమా??

(మొదటిపేజీ తరువాయి)

కాని అజీజ్ మేయర్ ఎన్నికలకు ముందే మంత్రి నారాయణను కలిసాడు. మేయర్ అయ్యాక మీ పార్టీలోకే వస్తానని ముందుగా చెప్పేసాడు. దాంతో నారాయణ, జడ్‌యస్ కోసం గట్టి ప్రయత్నాలు చేయలేదు. ఇటు వైకాపాలో చూస్తే అజీజ్ మేయర్ అయ్యాక తెలుగుదేశంలోకి పోతాడని కోటంరెడ్డి, అనిల్‌లకు ముందుగానే తెలుసు. అయినా అతను మైనార్టీవర్గాల వ్యక్తి, అప్పటికే మున్సిపల్ ఎన్నికల్లో డబ్బు ఖర్చుపెట్టి ఉన్నాడు. కాబట్టి అతనిని పోటీ నుండి తప్పించి ఇంకో అభ్యర్థిని పెట్టలేకపోయారు. అలాగని ఓడించే ప్రయత్నం కూడా చేయలేదు. ముస్లింలలో వ్యతిరేకత రాకూడదు కాబట్టి అజీజ్ పార్టీ మారే ప్రయత్నాల్లో ఉన్నాడని తెలిసినా కోటంరెడ్డి, అనిల్‌లు ఇద్దరూ తమ కార్పొరేటర్లను కాపాడుకుని అతనిని మేయర్‌ను చేసారు. ఇద్దరు ఎమ్మెల్యేలలో ఏ ఒక్కరు అజీజ్‌కు మొండిచేయి చూపి ఉన్నా అతను మేయర్ కుర్చీ ఎక్కే సమస్యే లేదు.

## ముందే చెప్పిన 'లాయర్'


మేయర్ పార్టీ మారేనా?

నెల్లూరు మేయర్ పార్టీ మారనున్నాడనే విషయం 'లాయర్' ఒక నెలక్రితమే వెల్లడించింది. ఇప్పుడు అది ఆచరణ రూపం దాల్చింది. మైనార్టీలకు ప్రయార్టీ ఇచ్చే దిశగా జగన్ ఒక ముస్లింను మేయర్ పీఠమెక్కిస్తే అతను ఈరోజు సైకిల్ ఎక్కుతున్నాడు. అంటే ఇది మైనార్టీలను వంచనకు గురిచేయడమే!

# అనిల్ గార్డెన్స్ కనపడలేదా??

అజీజ్ మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఫత్తేఖాన్‌పేటలోని రవీంద్ర భారతి స్కూల్‌పై ప్రతాపం చూపాడు. మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించారంటూ అక్కడున్న నిర్మాణాలను కూల్చివేసారు. మంత్రి నారాయణ, ఆయన అనుచరుడు, మాజీకార్పొరేటర్ చాట్ల నరసింహారావు కనుసైగతోనే మేయర్ అజీజ్ దగ్గరుండి మరీ ఈ కట్టడాలను తొలగించారు. అక్రమ నిర్మాణాలు ఎక్కడున్నా తొలగించాల్సిందే! వీటిని ఎవరూ అభ్యంతరం పెట్టరు. అలాగే ఇలాంటి అక్రమ నిర్మాణాలు నగరంలో కోకొల్లలుగా ఉన్నాయి. అజీజ్ వాటన్నింటిని కూడా దగ్గరుండి పడగొట్టించగలడా? అలా చేయగలిగితేనే ఆయన నిష్పక్షపాతంగా పనిచేస్తున్నట్లు! అంతెందుకు నెల్లూరు నడిబొడ్డులో 60అడుగుల మాస్టర్‌ప్లాన్ రోడ్డును ఆక్రమించి ఎటువంటి మున్సిపాల్టీ ప్లాన్ అప్రూవల్ లేకుండా కట్టిన 'అనిల్ గార్డెన్స్'ను తొలగించే దమ్ము, ధైర్యం ఈ మేయర్‌కు ఉందా? అనిల్ గార్డెన్స్‌ను తొలగించమంటూ హైకోర్టు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు నోటీసులు జారీ చేసింది. కాని ఇంతవరకు హైకోర్టు ఆదేశాలకు దిక్కు లేదు. పైగా కోర్టు ఆదేశాలను అడ్డంగా పెట్టుకుని అనిల్‌గార్డెన్స్ యాజమాన్యాన్ని భయపెడుతూ కొందరు మునిసిపల్ సిబ్బంది అడ్డంగా మెక్కేస్తున్నారు. మరి ఇలాంటి అక్రమనిర్మాణాలను అజీజ్ దగ్గరుండి కూల్చాల్సివుంది.

నెల్లూరు మేయర్ అజీజ్ తెలుగుదేశంలో చేరడం ఖాయం. దీనిద్వారా కొంత అప్రదిష్ట తప్పదు. ముఖ్యంగా ముస్లిం వర్గాలే జగన్‌కు అండగా నిలిచాయి. మైనార్టీ కార్డు ద్వారానే అజీజ్ మేయర్ అయ్యాడు. ఈరోజు జగన్‌తో పాటు ముస్లింల నమ్మకాన్ని కూడా తుంగలో తొక్కి అజీజ్ తెలుగుదేశంలో చేరుతున్నారు. కనీసం సమర్థవంతంగా పనిచేసన్నా ఈ అప్రదిష్టను తొలగించుకోవాలి.

# సీనియర్ న్యాయవాది రామారావుకు సన్మానం



సీనియర్ న్యాయవాది మరియు అనేక లా బుక్స్ ఆథర్ అయిన వై.రామారావును అగష్టు 2వ తేదిన సూళ్ళూరుపేటలో న్యాయమూర్తి నివాస భవనం ప్రారంభోత్సవ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జస్టీస్ సి.ప్రవీణ్‌కుమార్, నెల్లూరు జిల్లా ఫోర్టు ఫోలియో జడ్జిగా విచ్చేసిన సందర్భంగా సన్మాన కార్యక్రమం జరిగింది. సదరు కార్యక్రమంలో నెల్లూరుజిల్లా జడ్జి సిహెచ్ఎస్ దుర్గారావు మరియు సూళ్ళూరు పేట న్యాయమూర్తి నాగాశశిధర్‌రెడ్డి, గూడూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు మరియు గవర్నమెంటు ప్లీడరు అయిన యరగుడిపాటి చలపతిరావు అడిషనల్ పి.పి.రజినీ కాంత్‌రెడ్డి న్యాయవాదులు ఎన్.వెంగల్‌రెడ్డి, సి.రఘునాథరెడ్డి, తిరుమలేసు తదితరులు పాల్గొన్నారు.

# పురపాలక సంఘాలను అభివృద్ధి చేయండి

## రాష్ట్ర పురపాలక శాఖామంత్రి నారాయణ

పురపాలక సంఘాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత పాలకవర్గం, అధికారులపై ఉందని రాష్ట్ర పురపాలక శాఖామంత్రి పి.నారాయణ అన్నారు. గూడూరులోని పురపాలక సంఘ కార్యాలయంలో కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అభివృద్ధి చేస్తే కేంద్ర నిధులు త్వరితగతిన వస్తాయన్నారు. పట్టణాభివృద్ధికి కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో రూ.50వేల కోట్లు కేటాయించిందన్నారు. పన్నుల భారం లేకుండా సక్రమంగా వసూలు చేయాలని సూచించారు. అదేవిధంగా మంచినీటి కొళాయిలను అనధికారికంగా వేసి ఉంటే వాటిని క్రమబద్ధీకరించి వారి వద్ద నుంచి పన్ను కట్టించుకోవాలన్నారు. ముందు ఆదాయం పెంచే మార్గాలను అన్వేషిస్తే, ఆ తర్వాత అభివృద్ధి దానంతట అదే జరుగుతుందన్నారు. ఈ దిశగా పాలకవర్గాలకు శిక్షణ ఇస్తున్నామన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, కమీషనర్ అనురాధ, తెలుగుదేశం నాయకురాలు రాధాజ్యోత్స్నలత, కౌన్సిలర్లు, ఇతర అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




గూడూరు ప్రభుత్వ బాలుర వసతిగృహంలో తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న గూడూరు తహశీల్దార్ వెంకటేశ్వర్లురెడ్డి

## గూడూరు డివిజన్ వార్తలు

### లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో...


## విద్యార్థులకు గుర్తింపుకార్డులు



విద్యార్థులకు గుర్తింపుకార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరులోని పూలతోట గిరిజనకాలనీ ప్రాథమిక మున్సిపల్ పాఠశాలలో సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గుర్తింపుకార్డులు, బెల్ట్‌లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ విద్యపై లయన్స్ క్లబ్ సేవలు ఎంతో అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాత కడివేటి చంద్రశేఖర్, క్లబ్ అధ్యక్షకార్యదర్శులు సురేష్‌నాయుడు, నవీన్ జయకుమార్, కోశాధికారి చంద్రశేఖర్, కోట సునీల్‌కుమార్, మల్లు విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## సమస్యలపై ఆర్డీవోను కలిసిన బాధితులు



సమస్యలను ఆర్డీవోకు వివరిస్తున్న బాధితులు

గూడూరు పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆర్డీవో కె.శ్రీనివాసరావు ప్రజావిజ్ఞప్తుల దినాన్ని నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు ఆర్డీవో దృష్టికి తెచ్చారు. పట్టణంలో వికలాంగులు ఎంతోమంది ఉన్నారని, వారందరికీ పింఛన్లు అందడం లేదంటూ రెడ్‌సంస్థ ప్రతినిధులు జానా సుధీర్ వినతిపత్రం సమర్పించారు. కోట మండలం చిట్టేడులో నివాసముంటున్న ముస్లిం వర్గానికి చెందిన తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆ గ్రామస్థులు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించి తమకు న్యాయం చేయాలని అభ్యర్థించారు. ఇంకా పలు సమస్యలపై బాధితులు ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు.

### మహాయోగ హెల్పింగ్ సొసైటీ

## రక్తదాన శిబిరం



గూడూరులోని కరుణామయి డిగ్రీ కళాశాలలో ఆదివారం మహాయోగ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానం చేయడం ద్వారా దాతలు కూడా ఆరోగ్యవంతులుగా ఉంటారని పలువురు వక్తలు తెలిపారు. ఈ శిబిరంలో 64మంది విద్యార్థులు రక్తదానం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సొసైటీ వాలంటీర్లు, సభ్యులు కిరణ్, లోకేష్, మహేష్, హర్ష, అవినాష్, శ్రీనివాసులు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## బలిజలను బీసీలుగా చేసేందుకు ప్రణాళిక సిద్ధం



తెలుగుదేశంపార్టీ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆంధ్రాకు అన్యాయం జరిగిందని, అందరూ సహకరిస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. గూడూరు పట్టణంలోని రాజావీధిలోని బలిజ సంఘ నాయకుడు చదలవాడ హరిప్రసాద్‌నాయుడు నివాసంలో తెలుగుదేశం పార్టీ నాయకులతో ఆదివారం మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన సమయంలో, అనంతరం కూడా అందరికీ సమన్యాయం చేయాలని సీఎం చంద్రబాబునాయుడు పోరాడుతూనే ఉన్నారని తెలిపారు. పురపాలకసంఘాల కౌన్సిలర్లు, అధికారులు సహకరిస్తే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటారని, బలిజలను బీసీలుగా మార్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఖచ్చితంగా నెరవేరుస్తారన్నారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. పట్టణానికి విచ్చేసిన మంత్రికి నాయకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, మున్సిపల్ కమీషనర్ అనురాధ, వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, గూడూరు తెలుగుదేశం నాయకురాలు బత్తల రాధాజ్యోత్స్నలత, తెలుగుదేశం నాయకులు చదలవాడ హరిప్రసాద్‌నాయుడు, పొనకా శివకుమార్‌రెడ్డి, పట్టణంలోని తెలుగుదేశంపార్టీ కౌన్సిలర్లు, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, తహశీల్దార్ వెంకటేశ్వర్లురెడ్డి, డీఎస్పీ కె.చౌడేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రోటరీక్లబ్ ఆధ్వర్యంలో క్రీడాసామాగ్రి పంపిణి




క్రీడా పరికరాలను పంపిణీ చేస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

విద్యార్థి దశ నుంచి లక్ష్యం ఎంచుకొని ఆ దిశగా శ్రమిస్తే ఏదైనా సాధ్యమవుతుందని రోటరీక్లబ్ పీడీజీ బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి తెలిపారు. చిల్లకూరు మండలంలోని పాలిచర్లవారివాళెం గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రొటేరియన్ అశోక్‌చక్రవర్తి తల్లి ఎస్వీ శారదాంబ జ్ఞాపకార్థం క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి లక్ష్యం ముఖ్యమన్నారు. మార్కులతో సంబంధం లేకుండా కష్టపడి చదివితే కల సాకారమవుతుందన్నారు. ఇందుకు నిదర్శనం ఎంతోమంది విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో ఉండటమేనన్నారు. క్లబ్ అధ్యక్షుడు రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో చురుకుదనం, విలువలు ఉంటాయన్నారు. పదోతరగతి విద్యార్థుల కోసం త్వరలో బెంచీలను అందజేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఆ క్లబ్ ప్రతినిధులు గోపాల్‌రావు, దశరథరామిరెడ్డి, ఎస్వీ అశోక్‌చక్రవర్తి, కె.సుందరరామిరెడ్డి, శ్రీనివాసాచారి, రవీంద్రరెడ్డి, రమణబాబు, దయాకర్‌రెడ్డి, సర్పంచి మొబీనా, ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, స్థానికులు రామమోహన్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, పీఈటీ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటికి కటకట



గూడూరు పట్టణంలో ప్రజలు తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. 3రోజుల నుంచి పురపాలకసంఘం వారు తాగునీటి సరఫరాను సరిగా ప్రజలకు అందించలేకపోతున్నారు. దీంతో పట్టణ ప్రజలు దాహార్తితో అలమటిస్తున్నారు. ఆర్థికస్థోమత ఉన్నవారు శుద్ధిచేసిన నీటి డబ్బాలను కొనుగోలు చేస్తున్నారు. పేదలు మాత్రం స్థానికంగా దొరికే ఉప్పునీటితోనే గొంతు తడుపుకోవాల్సి వచ్చింది.

కండలేరు వద్ద నీటిని సరఫరా చేసే విద్యుత్ లైనుకు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైందని అధికారులు తాపీగా సమాధానమిచ్చి చేతులు దులుపుకున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని త్వరిత గతిన మరమ్మతులు చేయించాలని పట్టణ ప్రజానీకం కోరుతున్నారు.

# అభివృద్ధి కోసం టిడిపిలోకి వెళ్తున్నా

**- అజీజ్**



ప్రజలకు మేలు చేయాలని రాజకీయాల్లోకి వచ్చానని, అయితే సొంతపార్టీలో సహకారం వుండడం లేదని, అందువల్ల ప్రజల అభివృద్ధిని కాంక్షిస్తూ తెలుగుదేశం పార్టీలో చేరుతున్నానని నగర మేయర్ అబ్దుల్ అజీజ్ అన్నారు. ఈ నెల 6న ఆయన కార్పొరేషన్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, తాను టిడిపిలో చేరబోతున్నట్లు వస్తున్న వార్తలు వాస్తవమేనన్నారు. నరగ ఎమ్మెల్యే అనిల్‌తో ఇబ్బందులున్నాయని, ఆయన తనవద్దకు కార్పొరేటర్లను రానివ్వడం లేదని ఆరోపించారు. వైకాపాలో వుండి విభేదాలను ఎదుర్కొంటూ గడపడం, ప్రజలకు ఏమీ చేయలేకపోవడం కంటే, నగరాభివృద్ధి దృష్ట్యా టిడిపిలో చేరడానికే నిర్ణయించుకున్నానన్నారు. డబ్బు కోసం తాను పార్టీ మారుతున్నట్లు వచ్చే విమర్శల్లో అర్థం లేదని, డబ్బుకు కక్కుర్తిపడే ఖర్మ తనకు లేదని స్పష్టం చేశారు. అభివృద్ధిని కోరుకునే కార్పొరేటర్లంతా తనతో కలసివస్తారని ఆయన అన్నారు.

# ఏరు దాటి.. తెప్పతగలేసాడు!

**- అజీజ్‌పై అనిల్ ఆగ్రహం**



నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్ ఏరుదాటి తెప్పను తగలేసాడని నెల్లూరునగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ ఆరోపించారు. అజీజ్ తెలుగుదేశంలో చేరుతున్నానని చెప్పడం నయవంచనకు ప్రతిరూపంగా నిలుస్తుందని, ఇంతకంటే విశ్వాసఘాతుకం ఇంకొకటి ఉండదని ఆయన ధ్వజమెత్తారు. ఈ నెల 6వ తేదీన నగర వైకాపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక ముస్లింను మేయర్‌ను చేయాలన్న వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి మాటకు కట్టుబడి అజీజ్‌ను మేయర్‌ను చేసామన్నారు. ఆరోజు టీడీపీ ఆగడాలను అడ్డుకున్నాం. కార్పొరేటర్లను లాగేందుకు వారు వేసిన ప్రలోభాల ఎత్తులను అడ్డుకున్నాం. తెలుగుదేశంపార్టీ అధికారంలో వుండి, అధికారబలాన్ని చూపించినా మేము ఎదురొడ్డి నిలిచి అజీజ్‌ను మేయర్‌ను చేసాం. ముఖ్యంగా వైకాపా కార్పొరేటర్లకైతే అధికారపార్టీ వారి నుండి ఎన్నెన్నో ఆఫర్లు వచ్చినా వాళ్లంతా విశ్వసనీయతకు కట్టుబడి అజీజ్‌కే ఓటేసారు. కాని అజీజ్ ఈరోజు వారి నమ్మకాన్ని వంచించాడు. ముస్లిం సోదరుల నమ్మకాన్ని కూడా కోల్పోయాడు. ఇంతకంటే ద్రోహం, దుర్మార్గం ఇంకొకటి ఉండదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి కోసం పార్టీ మారుతున్నానని ఈరోజు అజీజ్ అంటున్నాడు. వైకాపా కార్పొరేటర్లు అభివృద్ధి కోసం తెలుగుదేశంలోకి వెళ్లుంటే అజీజ్ మేయర్ అయ్యుండేవాడా? అని ఆయన ప్రశ్నించారు. మేయర్ ఎన్నికకు ముందే అజీజ్ తెలుగుదేశం వారితో కుమ్మక్కయ్యాడు. మంత్రి నారాయణతో ముందుగానే చర్చలు జరిపాడు. ఇది నిజం కాదని అజీజ్ అల్లాపైన, పవిత్ర ఖురాన్‌పైన ప్రమాణం చేసి చెప్పగలడా? అని అనిల్ ప్రశ్నించారు. వంచనకు పాల్పడిన అజీజ్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

ఈ సమావేశంలో కార్పొరేటర్లు పి.రూప్‌కుమార్, ఓజిలి రవిచంద్ర, దామవరపు రాజశేఖర్, ఖలీల్ అహ్మద్, నాగరాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# విఎస్‌యుకి ప్రపంచస్థాయిలో గుర్తింపు తేవాలి

**- మంత్రి గంటా శ్రీనివాసరావు ఆకాంక్ష**



విక్రమ సింహపురి యూనివర్సిటీకి ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చేందుకు అందరూ కృషి చేయాలని, ఈ యూనివర్శిటీలో పరిశోధనలకు మంచి ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర విద్యాశాఖమంత్రి గంటా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఈ నెల 2న ఆయన వెంకటాచలం మండలం కాకుటూరు వద్ద రూ.12 కోట్లతో నిర్మించనున్న విఎస్‌యు భవన సముదాయానికి రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషిచేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ప్రాథమిక, మాధ్యమిక, సాంకేతిక విద్యలను ఒకే విభాగం కిందికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విఎస్‌యు అభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం వుంటుందని హామీ ఇచ్చారు. మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ జిల్లాకు ఎన్నో పరిశ్రమలు రానున్నాయని, పరిశ్రమలకు ఉపయోగపడేవిధంగా పరిశోధనలు సాగించాలని విఎస్‌యు అధ్యాపకులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, విఎస్‌యు ఉపకులపతి రాజా రామిరెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ వితపు బాలసుబ్రహ్మణ్యం, టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు బీద మస్తాన్‌రావు, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పరసా రత్నం, కాకుటూరు సర్పంచ్ అమరావతి, మండలాధ్యక్షురాలు అరుణమ్మ, జడ్పీటిసి సభ్యుడు శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# సోమిరెడ్డిని తగ్గిస్తున్నారు!

సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తన మేనమామ స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ద్వారా తెచ్చుకున్న రాజకీయ పోరాటతీరును ఆయన కొనసాగిస్తూనే వున్నాడు. 1992 ప్రాంతంలో తెలుగుదేశంపార్టీలో చేరిన ఆయన ఆరోజు నుండి ఈరోజు వరకు అదే పార్టీ కోసం పాటు పడుతున్నాడు. 2004 నుండి 2014వరకు తెలుగుదేశంపార్టీ ప్రతిపక్షంలో వున్న పదేళ్లకాలంలో పార్టీ కోసం నిలబడింది, పార్టీ కోసం కష్టపడింది, పార్టీ కోసం పోరాడింది సోమిరెడ్డే. ప్రతిపక్షంలో ఉన్నప్పుడైనా, అధికారంలో వున్నప్పుడైనా ప్రత్యర్థుల విమర్శలకు ఘాటుగా, దీటుగా సమాధానమిచ్చింది ఆయనే! పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన సోమిరెడ్డిని ఇప్పుడు సొంత పార్టీలోనే చిన్నచూపు చూస్తున్నారన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. దీనికి కారణం జిల్లా తెలుగుదేశంపార్టీకి పెద్దదిక్కుగా వున్న సోమిరెడ్డికి తెలియకుండానే జిల్లా పార్టీలో కొన్ని నిర్ణయాలు జరిగిపోతుండడం. నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ అబ్దుల్ అజీజ్‌ను పార్టీలో చేర్చుకోవడం. సోమిరెడ్డితో సంబంధం లేకుండానే జరిగిపోయినట్లుగా తెలుస్తుంది. ఎందుకంటే తెలుగుదేశంలోకి అజీజ్ రావడాన్ని సోమిరెడ్డి వ్యతిరేకిస్తారు. ఇటీవలే మేయర్ ఎన్నికలు జరిగాయి. తెలుగుదేశం అభ్యర్థిగా డాక్టర్ జడ్.శివప్రసాద్ పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడాయన కార్పొరేషన్‌లో ప్రతిపక్షనేత. ఇప్పుడు అజీజ్ తెలుగుదేశంలోకి పోతే ప్రతిపక్షం వైకాపా అవుతుంది. తెలుగుదేశంపార్టీ కోసం ఖర్చుపెట్టుకుని కార్పొరేటర్లను గెలిపించుకున్న డాక్టర్ జడ్.యస్.కు ప్రతిపక్షనేత హోదా వుండదు. పార్టీ కోసం అన్ని విధాలా నష్టపోయిన జడ్.యస్.కు అన్యాయం జరగకూడదనే ఉద్దేశ్యంతోనే అజీజ్‌ను పార్టీలోకి తీసుకోవడాన్ని వ్యతిరేకించాడు.

కాని తెలుగుదేశంపార్టీలో సోమిరెడ్డి ప్రాధాన్యతను తగ్గించేందుకు చంద్రబాబు వద్ద నుండే ప్రయత్నం మొదలైంది. జిల్లాలో మంత్రి నారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షులు రవిచంద్రలను మిగతా నాయకులను కలిపి ఒక టీమ్‌గా ఏర్పాటు చేసాడు. జిల్లాలో అధికారుల బదిలీలు గాని, ఇతరత్రా అధికారిక కార్యకలాపాలుగాని, పార్టీకి సంబంధించిన ఇతర నిర్ణయాలు గాని వారిద్వారానే జరిగిపోయేలా చేసాడు. ఒకరకంగా పార్టీలో సోమిరెడ్డికి ఎటువంటి సీన్ లేదని చెప్పే ప్రయత్నం జరుగుతుంది. కాకపోతే ప్రతిపక్షం నుండి విమర్శలు వచ్చినప్పుడు వాటిని తిప్పికొట్టడానికి సబ్జెక్ట్ పరంగా మాట్లాడగలిగిన నాయకులెవరూ పార్టీలో లేరు. అందుకు సోమిరెడ్డి తగినవాడు. అందుకే ఆయనకు ఇప్పుడున్న పార్టీ పొలిట్‌బ్యూరో పదవితో పాటూ భవిష్యత్‌లో ఎమ్మెల్సీ పదవి ఇస్తామని ఆశపెట్టి వున్నారు. అంతేగాని జిల్లా పెత్తనం మొత్తం మాత్రం ఆయన చేతుల్లో పెట్టే అవకాశాలు లేవు.

జిల్లాలో పార్టీ దెబ్బతినడానికి సోమిరెడ్డే కారణమనే భావన చంద్రబాబులో వుంది. కాని సోమిరెడ్డి ఒక్కడి వల్లే జిల్లాలో పార్టీ దెబ్బతిందనేది వాస్తవం కాదు. 1994, 1999ఎన్నికల్లో ఈ జిల్లాలో తెలుగుదేశంపార్టీకే ఎక్కువ సీట్లు వచ్చాయి. వై.యస్. గాలి బలంగా వీచిన 2004ఎన్నికల్లో అన్ని జిల్లాలలో లాగే ఈ జిల్లాలోనూ ఫలితాలు వచ్చాయి. 2009ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఈ జిల్లాలో మాత్రం తెలుగుదేశంకే ఒక సీటు అదనంగా వచ్చింది. 2014ఎన్నికల్లో ఈ జిల్లాలో తెలుగుదేశంకు మూడు సీట్లే వచ్చాయంటే దానికి కారణం స్థానిక పరిస్థితులే కాని సోమిరెడ్డి కాదు. ఈ జిల్లాలో సోమిరెడ్డి వల్ల సీట్లు తగ్గాయనుకుంటే, మరి కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో ఎవరివల్ల సీట్లు తగ్గినట్లు? సోమిరెడ్డిని పక్కన పెట్టేందుకే ఈ సీట్లు తేడాను చూపిస్తున్నారు.



ప్రస్తుత తరం జిల్లా రాజకీయాలలో సబ్జెక్ట్ ఉన్న నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. రాజకీయాన్నే వృత్తిగా స్వీకరించిన అతికొద్దిమంది నాయకుల్లో ఈయనొకరు. రాజకీయాల్ని ఆయన నుండి వేరు చేసి చూడలేము.

# 'వాత్సల్య'.. ఆదర్శవంతమైన సంస్థ

వాత్సల్య విద్యా సంస్థ ఒక ఆదర్శవంతమైన సంస్థగా పనిచేస్తోందని, ఇలాంటి మంచి సంస్థ తన నియోజకవర్గం పరిధిలో వుండడం తనకెంతో సంతోషం కలిగిస్తోందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు.

గురువారం ఆయన జనహిత-వాత్సల్య ఆధ్వర్యంలో నడుస్తున్న భారతీయ విద్యా వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూలులో హైదరాబాద్‌లోని వసుధ ఫౌండేషన్ వారు చిన్నారులకు నోటుపుస్తకాలు పంపిణీ చేసే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు క్రమశిక్షణ, పట్టుదలతో, ఆత్మవిశ్వాసంతో ఉన్నతంగా ఎదగాలని, మంచి లక్ష్యాలను సాధించాలని అన్నారు. తానేమీ సంపన్నుడిని కాదని, చిన్నతనం నుంచి క్రమశిక్షణతో కష్టపడి పనిచేస్తూ, ప్రజలతో కలసిమెలసి వుంటూ ఇప్పుడు ఈ స్థాయికి ఎదిగానని అన్నారు. చదువులో మంచి ప్రతిభను కనపరిచే 12మంది విద్యార్థులకు రూ.10 వేల వంతున ఉపకారవేతనంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నానని, ఈ ఏడాది వాత్సల్యలో చదువుతున్న ఒక విద్యార్థికి రూ.10వేల సాయాన్ని ఉపకారవేతనంగా అందివ్వగలనని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. వసుధ ఫౌండేషన్ నిర్వాహకులు ఎన్.శివరామరాజు, ఎన్.ప్రభాకరరాజు మాట్లాడుతూ వాత్సల్య వంటి సంస్థకు సాయపడడం తమకెంతో సంతోషంగా వుందని, ఇక్కడి చిన్నారులకు ప్రతిఏటా పుస్తకాలు, పెన్నులు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి జనహిత-వాత్సల్య గౌరవాధ్యక్షులు సామంతు గోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించగా, ఎన్.సుధాకరరెడ్డి, ఎపిడబ్ల్యుజె రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.జయప్రకాష్, జివి సాంబశివరావు, హెచ్‌ఎం మధుసూదనరెడ్డి, జనహిత వాత్సల్య సహాయకార్యదర్శి టివిఎస్ దుర్గాప్రసాదరావు, ఇసి మెంబర్ బివిఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి.



విద్యార్థినులకు నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పక్కన సామంతు గోపాలరెడ్డి తదితరులు

## ఏసిబికి వీరాంజనేయరెడ్డి

జిల్లాలో సుదీర్ఘకాలం ఎస్సైగా, సిఐగా పనిచేసి ఇటీవలే డిఎస్పీగా పదోన్నతి పొందిన పి.వీరాంజనేయరెడ్డిని ఏసిబి డిఎస్పీగా నియమించనున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన డిఎస్పీల బదిలీలలో ఆయనను తిరుపతిలోని పోలీస్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించారు. అయితే అక్కడ నుండి ఏసిబికి బదిలీ చేయనున్నారని తెలుస్తోంది. నెల్లూరు గాని, తిరుపతి లేదా ఒంగోలులో ఆయనను ఏసిబి డిఎస్పీగా నియమించే అవకాశం వుంది.

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.